# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue II - Feb 2025



## పరుగు పందెం

# ఓపిక

మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలు, ప్రతి కష్టాన్ని అధిగమించడానికి అవసరమైనది ఓపిక. “మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము” అనే వాక్యం మనకు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ ఓపిక మనకు శక్తిని, ధైర్యాన్ని ఇస్తుంది. మనం ఎదుర్కొనే కష్టాలు, పరీక్షలు మనకు కొత్త అనుభవాలను, పాఠాలను నేర్పిస్తాయి. అందువల్ల, మనం ఈ కష్టాలను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలి. ఒక పందెంలో పరిగెత్తాలంటే ఓపిక అవసరం. అలాగే, మన ఆత్మీయ జీవితంలో కూడా ముందుకు సాగాలంటే ఓపిక అనేది అత్యంత కీలకమైన అంశం. గ్రీకు భాషలో ‘హుపోమోనయ్’ అనే పదం, క్లిష్టమైన పరిస్థితులలో ఓపికతో నిలకడగా ఉండే సామర్థ్యాన్ని సూచిస్తుంది. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావడానికి, కష్టాలను ఎదుర్కొని ఓపికతో చదవడం ఎంత ముఖ్యమో, అదే విధంగా మన ఆధ్యాత్మిక పరుగు పందెంలో కూడా విజయం సాధించడానికి ఈ ఓపిక అవసరం.

ప్రతి పరీక్షలో, ప్రతి కష్టంలో మనం నిరుత్సాహం మరియు నిస్పృహకు స్థానం ఇవ్వకుండా మనలోని శక్తిని గుర్తించాలి. మనం ఎల్లప్పుడూ ఆశావాదంగా ఉండాలి. మనం ఎదుర్కొనే ప్రతి కష్టాన్ని ఒక అవకాశంగా భావించి, దానిని అధిగమించడానికి ప్రయత్నించాలి.

ప్రభువు మన కోసం అత్యున్నతమైన ‘ఓర్పు’ ను కలిగి మనకు బదులుగా ఆయన సిలువను భరించి, మనకు ‘రక్షణ’ కార్యాన్ని పూర్తి చేశారు. ఆయన మన కష్టాలను అర్థం చేసుకుంటారు. కష్టకాలంలో, సమస్యలలో, శోధనలలో, నిరుత్సాహంలో మనం ఆయన వైపు చూడాలి. ఆయన మనకు అన్నిటిపైన విజయమిచ్చి మనలను జయించేవారిగా తీర్చిదిద్దుతారు.

మన దృష్టి లోకం వైపు, పాపం వైపు మళ్లితే మనం పందెంలో నష్టపోతాము. అందుకే, మనందరం ఒకరినొకరు ప్రోత్సాహించుకుంటూ, ప్రతి భారాన్ని, సులువుగా చిక్కులు పెట్టే పాపాన్ని విడిచి పెట్టి, ఆయన వైపు చూస్తూ ముందుకు పరిగెత్తుదాం. మనం ఓపికతో, ధైర్యంతో ముందుకు సాగితే, ప్రతి కష్టాన్ని అధిగమించి, విజయాన్ని సాధించగలుగుతాం. అట్టి కృప, సహాయం పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక!

– దాసరి రాజేష్

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue II - Feb 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH



**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Simon, Hyderabad
Mrs. P. Raja Kumari, Hyderabad
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. L.Vinodha, Sangareddy



**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com


**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - East Maredpally, Secunderabad
IFSC code - CNRB0000624

Kindly inform the office after depositing amount. Ph. **8985482388**

**Please furnish the following details**
Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEMES:**
March - The Power of Prayer
April - The Importance of Scripture

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు

## విషయ సూచిక


| | |
|---|---|
| పరుగు పందెం | 4 |
| పరుగు పందెంలో ఉత్సాహం | 7 |
| జీవితకాలం నేర్చుకోవడం | 10 |
| సోమరితనం | 17 |
| చదవండి ఇలా | |
| మంచి మార్కులు మీ సొంతం | 21 |
| మేరీ జోన్స్ | 24 |
| వ్యక్తులు - వ్యక్తిత్వాలు | 28 |
| పరుగో... పరుగు | 29 |


## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్ స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

**ప్రతి నెల ప్రార్థనాంశాలు 10వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాల ను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు** editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

- విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్

కవర్ స్టోరీ

# పరుగు పందెం



క్రైస్తవ విశ్వాస జీవితాన్ని బైబిల్ ఒక పరుగు పందెంతో పోలుస్తుంది. అపొస్తలుడైన పౌలు తన పత్రికలలో ఈ విషయాన్ని చాలాసార్లు ప్రస్తావించాడు (1 కొరింథీ 9:24-27, గలతీ 5:7, ఫిలిప్పీ 2:16, 2 తిమోతి 2:5, 4:7). హెబ్రీ 12:2 ప్రకారం, విశ్వాసులందరి ఎదుట ఉంచబడిన పరుగు పందెం ఇది. దేవుడు ప్రతి ఒక్కరిని ఒక ఉద్దేశ్యంతో పిలిచాడు. ఆ ఉద్దేశాన్ని నెరవేర్చడమే మన జీవిత లక్ష్యం. ఒక పరుగు పందెంలో విజేతకు బహుమతి ఎలా ఉంటుందో, అదేవిధంగా మన విశ్వాస జీవిత పరుగు పందెంలో కూడా దేవుడు మనల్ని పిలిచిన ఉద్దేశ్యాన్ని (లక్ష్యాన్ని) సంపూర్ణంగా నెరవేర్చినప్పుడు, మనకు కూడా బహుమానం దక్కుతుంది.

పరుగు పందెంలో విజయం సాధించాలనుకునే వ్యక్తి మూడు ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టాలి. అవి: లక్ష్యం, విశ్వాసం, ఓపిక.

## 1. లక్ష్యం

జీవితంలో ఉన్నతమైన పిలుపుకు కలుగు బహుమానం పొందడం అనేది ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి మన పరుగును తుది వరకు కొనసాగించాలి. పౌలు తన జీవితం ముగింపులో “నా పరుగును ముగించితిని, నా కొరకు నీతికిరీట ముంచబడియున్నది” అని 2 తిమోతి 4:7-8 లో సంతృప్తితో చెప్పినట్లుగా, మన జీవిత ప్రయాణంలో కూడా ఒక గొప్ప ముగింపును ఇవ్వడానికి ప్రయత్నించాలి. మన కోసం నీతి కిరీటం వేచి ఉందని గుర్తుంచుకోవాలి.

పరుగు పందెంలో పాల్గొనే క్రీడాకారుడు అన్ని విషయాలలో మితముగా ఉండాలి (1 కొరింథీ 9:25). అలాగే, మన జీవిత ప్రయాణంలో కూడా మనం వ్యక్తిగత క్రమశిక్షణను పాటించాలి. ప్రతిరోజు వాక్యన్ని పఠించడం, ప్రార్థన చేయడం, సహవాసం కలిగియుండడం వంటి ఆధ్యాత్మిక క్రమశిక్షణలు మనల్ని ముందుకు నడిపిస్తాయి.

అనవసరమైన లేదా మనల్ని వెనక్కి లాగే బరువులను వదిలించుకోవాలి. పాపం, మన దృష్టిని మరల్చే ఆకర్షణలు, సమయం వృధా చేసే సెల్‌ఫోన్‌లు మన వేగాన్ని తగ్గిస్తాయి. కాబట్టి, ఈ విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మన లక్ష్యం వైపు స్థిరంగా అడుగులు వేస్తూ ముందుకు కొనసాగాలి.

### 2. విశ్వాసం

విశ్వాసం అనేది మన ఆధ్యాత్మిక జీవితానికి పునాది వంటిది. యేసుక్రీస్తు నందు విశ్వాస ముంచడం ద్వారానే మన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది. అందుకే, మన "విశ్వాసానికి కర్త, దానిని కొనసాగించేవాడు ఆయనే" అని బైబిల్ చెబుతోంది (హెబ్రీ 12:2). మనకు స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని, బలాన్ని ఇచ్చేది ఆయనే. యేసుక్రీస్తు మనకు మాదిరి; ఆయన కూడా తన ముందు ఉంచబడిన ఆనందం కోసం ఎంతో ప్రయాసపడ్డాడు. అవమానాలను లెక్కచేయక సిలువను సహించి, మరణాన్ని గెలిచి విజయుడుగా నిలిచాడు (హెబ్రీ 5:7-8). ఆయనే మనల్ని విజయపథంలో నడిపిస్తాడు. కాబట్టి, ఆయనపై విశ్వాసముంచి ముందుకు సాగాలి.

జీవితంలో విశ్వాసాన్ని బలహీనపరిచే అనేక పరిస్థితులు ఎదురవుతాయి. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ సమస్యలు, అవమానాలు, నిందలు, బంధకాలు, చెరసాల వంటివి మనల్ని కృంగదీయవచ్చు. ఇవి మన ముందు ఎత్తైన కొండల్లా అడ్డుగా నిలచినప్పుడు వాటిని దాట లేమేమో అనిపించవచ్చు. అయితే, క్రైస్తవ జీవితంలో సమస్యలు, శ్రమలు తప్పవు. వాటిని విశ్వాసం ద్వారానే జయించగలం. హెబ్రీ 11వ అధ్యాయంలో మన ముందు ఉన్న భక్తులు విశ్వాసంతో ఎలా విశ్వాస వీరులైనారో అక్కడ చదువుతాం.

కనాను దేశాన్ని వేగు చూడటానికి వెళ్లిన 12 మందిలో 10 మంది అక్కడి ప్రజలను చూడగానే వారి గుండెలు జారిపోయాయి. వారు ఉన్నత దేహులు, బలవంతులు, ఆ దేశం తన నివాసులను భక్షించు దేశమని చెప్పి ఇశ్రాయేలీయులందరినీ అధైర్యపరిచారు. వారందరు భయపడి, ఏడ్చి వెనుకకు వెళ్ళి పోవడానికి తీర్మానించుకున్నారు. కానీ కాలేబు, యెహోషువ మాత్రం "దేవుడు మన యందు ఆనందించిన యెడల మనం తప్పక స్వతంత్రించుకుంటాం" అని విశ్వాసంతో చెప్పారు (సంఖ్యా 13,14 అధ్యాయాలు).

విశ్వాసం ధైర్యాన్ని, గెలుస్తాను, సాధిస్తామనే నమ్మకాన్ని కలుగజేస్తుంది. కేవలం ఆ ఇద్దరు మాత్రమే వాగ్దాన దేశాన్ని స్వతంత్రించుకున్నారు. మిగిలిన లక్షల మంది ప్రజలు కేవలం వారి అవిశ్వాసాన్ని బట్టియే అరణ్యంలోనే రాలిపోయారు. ఆధ్యాత్మిక జీవితంలో విశ్వాసం చాలా ముఖ్యం. విశ్వాసం లేకపోతే దేవునికి ఇష్టులై ఉండటం అసాధ్యం. మన విశ్వాసం ఎంత బలంగా ఉంటే, అంతగా ఎక్కువగా పరుగు పందెంలో నిలకడగా ముందుకు సాగుతూ మన గమ్యాన్ని చేరుకోగల ంగుతాం.

### 3. ఓపిక

పందెములో పరుగెత్తుటకు ఓపిక చాలా అవసరం. ఎందుకంటే అలసట, విసుగు, నిరుత్సాహం వంటివి మనల్ని ముందుకు సాగనివ్వకుండా అడ్డుకుంటాయి. కొన్నిసార్లు, 'ఇక చాలు, నేను పరుగెత్తలేను' అని నిరుత్సాపడవచ్చు. మనం చేసిన దానితో సంతృప్తి చెంది అక్కడితో ఆగి పోవాలని అనిపించవచ్చు. నిస్తబ్దతగా, నిర్లిప్తగా ఉండాలని అనిపించవచ్చు. ప్రవక్త ఏలీయా కూడా ఒకానొక సమయంలో ఇలాంటి నిరుత్సాహానికి గురయ్యాడు. ఇక తన పని అయిపోయిందని అతను భావించాడు. కానీ, దేవుడు నమ్మదగినవాడు. ఆయన మనల్ని లేపి, నిలబెట్టగల సామర్థ్యం కలిగినవాడు.

ఫిలిప్పీయులకు రాసిన పత్రిక 3:12-14 లో పౌలు, "వెనుక ఉన్న వాటిని మరచి, ముందున్న వాటి కొరకు వేగిరపడుతూ, గురి వైపు పరుగెత్తుతున్నాను" అని అంటాడు. ఆయనకు ఈ ప్రోత్సాహం ప్రభువు నుండి లభించింది. పౌలు తన జీవితంలో క్రీస్తును ఆదర్శంగా తీసుకున్నాడు. "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలు చెప్పడంలో, ఆయన ఆత్మీయ జీవితం యేసుక్రీస్తును చూస్తూ సాగిందని మనకు అర్థమవుతుంది. మనం కూడా ఈ స్ఫూహాతో మన ముందున్న పరుగు పందెంలో ఓపికతో పరుగెత్తుదాం.

## ముగింపు

మన జీవిత ప్రయాణంలో క్రీస్తును అనుసరిస్తూ, విశ్వాసంతో ముందుకు సాగడం అత్యంత ముఖ్యం ఆయన మనకు తోడుగా ఉంటూ మనల్ని గమ్యానికి చేరుస్తాడు. ఒక పరుగు పందెంలో గెలవాలంటే ఎంత కష్టపడతామో, క్రైస్తవ జీవితంలో కూడా మన విశ్వాసంతో కూడిన పరుగు పందెమును గెలవడానికి అంతకంటే ఎక్కువ శ్రమించాలి. కష్టాలు, మనల్ని కృంగదీసే పరిస్థితులు ఎదురైనప్పుడు, పరుగు పందెంలో పడిపోకుండా నిలకడ ఉండటానికి విశ్వాసం మనల్ని స్థిరంగా ఉంచుతుంది "యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు వారు పక్షిరాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడిచి పోవుదురు" (యెషయా 40:31). దేవునిపై నమ్మకంతో ముందుకు సాగితే, మన జీవిత ప్రయాణాన్ని సంతోషంగా ముగించవచ్చు.

– భానుశ్రీ,
సనత్‌నగర్, హైదరాబాద్

✦✦✦✦✦✦✦✦✦

# WANTED STAFF FOR UESI-TELANGANA STATE

UESI TELANGANA

**Requirement: Staff Coordinators - 2 & City Office (Resource Center) Staff - 1**

### Qualifications for All Staff

1. Born again experience with sound doctrinal convictions.
2. EU background and having definite call for students' ministry.
3. Any secular degree (UG/PG) with computer/English language skills.

### Job Description of City Office (Resource Center) Staff

### Responsible for the functioning of City Office Supervision and Maintenance

1. Reporting Regional Co-ordinator and State Secretary.
2. Answer phone calls and direct callers with proper information.
3. Checking and sorting emails.
4. Sending and gathering prayer-related information from zones
5. Maintain proper office records.
6. Assist with works related to the bank, monthly receipts, and dispatching receipts to zones.
7. Tally entry of receipts and expenditure
8. Reminders to Zones for upcoming programs and monthly contributions
9. Assist the district treasurer with income & expenditure statements.
10. Maintain the office library with a proper register.
11. Maintain an inward and outward library books movement register.
12. Maintain stock of books for sale.
13. Maintain Resource Center inventory assets and movements.
14. Help the regional/district committee for meetings, camps, conferences, and combined gatherings.
15. Maintain the visitors register and venue booking.
16. Providing support to guests visiting the Resource Center
17. Arranging Logistics for Regional/District/Divisional Programs.
18. Perform other related works based on the need by the district.
19. Reporting to the state office on a weekly basis.

### Please Note

1. Salary will be paid according to the approved pay structure.
2. Send your requisition letter to rajesh4christos@gmail.com
3. Please apply before March 2, 2025.

**- Executive Committee**



# పరుగు పందెంలో ఉత్సాహం

సిడ్నీ మెక్‌లాఫ్లిన్-లెవ్రోన్, 25 సంవత్సరాల అమెరికన్ క్రీడాకారిణి, హర్డ్లర్ మరియు స్ప్రింటర్‌గా ప్రసిద్ధి చెందింది. ఆమె నాలుగు సార్లు ఒలింపిక్ బంగారు పతకం గెలుచుకున్నది. పారిస్ 2024 ఒలింపిక్ గేమ్స్‌లో 400 మీటర్ల హర్డిల్స్‌లో పోటీ పడి తన స్వంత ప్రపంచ రికార్డునే అధిగమించింది.

సిడ్నీ తన విశ్వాసాన్ని తన చోదక శక్తిగా భావిస్తుంది మరియు మీడియా ద్వారా తన క్రైస్తవ విశ్వాసాలను బహిరంగంగా పంచుకుంటుంది. క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చిన సిడ్నీ తన కుటుంబ సభ్యులందరినీ అధిగమించి అగ్రస్థానానికి చేరుకుంది.

"మనందరం మనకోసం నిర్ణయించబడిన పరుగులో ఉన్నాము, జయ కిరీటాన్ని గెలుచు కోవడానికి ముందుకు సాగుతున్నాము" (2 తిమోతి 2:5). సిడ్నీ తనకు ప్రతిభను, పట్టుదలను ఇచ్చిన దేవుని గుర్తించింది. పరుగు పట్ల తనకున్న ప్రేమనే తనను ఛాంపియన్‌గా మార్చిందని ఆమె పంచుకుంది. "మీకు ఈ పరుగు అంటే ఇష్టం ఉండి, మీరు పరుగెత్తాలనుకుంటే, అది గొప్ప విషయం."

ఫ్రెండ్, క్రీస్తుతో కలిసి ఆయన కొరకు ఈ పరుగును పరిగెత్తడానికి ఇష్టపడుతున్నావా? విశ్వాస వీరులు మరియు యు.ఇ.యస్.ఐ. పితరులు ఈ పరుగును ఎంతో ప్రేమించారు, ఆదరించారు. వారు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, విశ్వాసమునకు కర్త మరియు దానిని కొనసాగించు వాడునైన యేసుపై తమ దృష్టిని నిలిపి హెబ్రీ 12:1లో చెప్పినట్లుగా తమ పరుగును విజయవంతంగా పూర్తి చేశారు.

### పరుగుకు అర్హత

పరుగు పందెంలో అర్హత కలిగిన వారే పరుగెత్తగలరు. దీని కోసం వారు ఎంతో కఠోరమైన శిక్షణను పొందవలసి ఉంటుంది. ఆత్మీయ పరుగులో అర్హత సాధించడానికి మనం యేసుక్రీస్తు సిలువపై చేసిన పనిని నమ్మి, పరిశుద్ధాత్మ దేవుని కృప ద్వారా మన జీవితాల్లో ఆయన చేసిన కార్యాన్ని విశ్వసించాలి. ఈ పరుగును ప్రతిరోజూ కొనసాగించే అవకాశమనేది మనకు ఉచితంగా ఇవ్వబడిన ఒక గొప్ప ఆధిక్యత.

"నేను ప్రతిరోజూ ట్రాక్‌కు రాగలుగుతాను, అది ఆయన నాకు ఇచ్చిన బహుమానమని అర్థం చేసుకుంటాను. ఆయనను మహిమపరచడానికి నాకు లభించిన ఒక అవకాశం ఇది. నా విలువ క్రీస్తులోనే సురక్షితంగా ఉంది" అని సిడ్నీ అంటుంది.

### ఆహారం మరియు క్రమశిక్షణ

సిడ్నీ ఒలింపిక్స్‌లో విజయం సాధించడానికి కఠినమైన ఆహార నియమాలు, క్రమశిక్షణను పాటించింది. ఆమె భావోద్వేగంగా, మానసికంగా, శారీరకంగా, సామాజికంగా మరియు ఆధ్యాత్మి



"ఒక క్షణం కోసం సిద్ధం కావడం ఎల్లప్పుడూ కష్టమే, అది మనకు తిరిగి వస్తుందో లేదో తెలియదు. నా మనస్సులో, "యేసును నమ్ము" అనే మాటలు పదే పదే వినిపిస్తాయి. తనను నమ్మిన వారి అంతరంగ పోరాటాలను అధిగమించడానికి ఆయన ఎంత శక్తిమంతుడో చూసి నేను ఆశ్చర్యపోతూనే ఉన్నాను. ఆయన వాగ్దానాలు నిజమవుతాయి.

- సిడ్నీ మెక్‌లాఫ్లిన్-లెవ్రోన్

కంగా సమతుల్యత, మితము మరియు ఆత్మనిగ్రహం కలిగి ఉండకపోతే ఆమె విజయం సాధించి ఉండకపోవచ్చు. అదేవిధంగా, మన ఆధ్యాత్మిక పరుగులో గమ్యాన్ని చేరుకోవడానికి, దేవుని సన్నిధిలో మనల్ని మనం నింపుకునే ఆధ్యాత్మిక ఆహారాన్ని తీసుకోవాలి. నిరంతర సంభాషణ మరియు ఆయనకు విధేయత చూపుతూ పరిశుద్ధాత్మ స్వరం ద్వారా నడిపించబడాలి.

వాక్యం చదవడం, ప్రార్థన, ఉపవాసం, పవిత్రత, ఆరాధన, ఏకాంతంగా దేవునితో గడపడం, ఒప్పుకోలు, పశ్చాత్తాపం, మనకు కలిగినవి ఇవ్వడం, సాక్ష్యం చెప్పడం వంటి ఆధ్యాత్మిక క్రమశిక్షణలు మనల్ని పరుగుకు సిద్ధం చేస్తాయి (1 కొరింథీ 9:24-27, 1 తిమోతి 4:8).

"ప్రతిరోజూ నా జీవితంలో ప్రార్థన ఒక ముఖ్యమైన భాగం. దేవునితో సంభాషించడం, నా హృదయంలో ఉన్నదాన్ని ఆయనకు తెలియజేయడం, నా ఆలోచనలు, భావాలను పంచుకోవడం మరియు ఆయన సన్నిధిలో కూర్చోవడానికి నాకు సన్నిహిత సమయం ఉండడం చాలా అవసరం. ఆ రహస్య స్థలంలో, నేను మరియు ఆయన మాత్రమే ఉంటాము. అక్కడ నేను ప్రతిదీ ఆయన పాదాల దగ్గర ఉంచగలను, దీని కోసమే నేను పిలువబడ్డాను"- సిడ్నీ.

## కోచ్ మరియు కౌన్సిలర్స్

ఒక మంచి కోచ్ మనల్ని గైడ్ చేస్తూ, సరిదిద్దుతూ, హెచ్చరిస్తూ, ప్రోత్సహిస్తూ మన ఎదుగుదలకు తోడ్పడతాడు. ఆవిధంగానే, త్రియేక దేవుడు మన కోచ్‌గా తన వాక్యమైన బైబిల్ ద్వారా మనల్ని నడిపిస్తూ, మనల్ని సరిచేస్తూ, మనకు శిక్షణ నిస్తూ, మనలను గమ్యానికి చేరుస్తాడు (2 తిమోతి 3:16).

అంతేకాకుండా, ఆయన మన జీవితాలలో మెంటార్స్ (కౌన్సిలర్స్) ను కూడా దయచేస్తాడు. వీరు మనకంటే ముందు జీవిత మార్గంలో నడిచిన అనుభవజ్ఞులు. వారు తమ అనుభవాల ద్వారా మనకు బోధిస్తారు. మనకు సహాయం చేస్తూ, మనకోసం ప్రార్థిస్తూ, ఈ జీవిత పరుగు పందెమును మరింత సమర్థవంతంగా, నిరంతరాయంగా కొనసాగించడానికి సహాయపడతారు.

## అడ్డంకులు మరియు పోరాటాలు

మన జీవితమనే పరుగు పందెంలో అనేక అడ్డంకులు మనల్ని ఆపడానికి, బలహీనపరచడానికి మరియు నిరుత్సాహపరచడానికి ప్రయత్నిస్తాయి. ఇవి మన శక్తిని తగ్గిస్తాయి. మనం సాతాను, లోకం మరియు శరీర కోరికల నుండి శోధనలను ఎదుర్కొన్నప్పుడు, అలాగే భవిష్యత్తు గురించి అనిశ్చితమైన, ఆందోళనకరమైన పరిస్థితులు, తోటివారి ఒత్తిడి వంటి వాటిని ఎదుర్కొన్నప్పుడు, సిడ్నీలాగా మనం యేసును మాత్రమే నమ్ముదాం. ఆయన మన పరుగును విజయవంతంగా పూర్తి చేయడానికి మనకు సహాయం చేస్తాడు.

"ఒక క్షణం కోసం సిద్ధం కావడం ఎల్లప్పుడూ కష్టమే, అది మనకు తిరిగి వస్తుందో లేదో తెలియదు. నా మనస్సులో, "యేసును నమ్ము" అనే మాటలు పదే పదే వినిపిస్తాయి. తనను నమ్మిన వారి అంతరంగ పోరాటాలను అధిగమించడానికి ఆయన ఎంత శక్తిమంతుడో చూసి నేను ఆశ్చర్యపోతూనే ఉన్నాను. ఆయన వాగ్దానాలు నిజమవుతాయి." - సిడ్నీ

## నేర్చుకోవాల్సిన జీవిత పాఠాలు

మన జీవిత ప్రయాణంలో మనకోసం నిర్ణయించిన మార్గంలో పరుగెడుతూ పట్టుదలతో ఉండడం, దేవునికి మనల్ని మనం సమర్పించుకోవడం, వినయంగా ఉండటం, క్షమించడం, త్యాగం చేయడం, స్వార్థాన్ని విడిచిపెట్టడం, నిజాయితీగా జీవించడం, ఇతరుల పట్ల దయ కలిగి ఉండటం, నమ్మకంగా ఉండడం, కష్టపడి పనిచేయడం మరియు అంకితభావంతో ఉండటం వంటి విషయాలను మనం నేర్చుకుంటాం. అంతేకాకుండా దేవుని ఆత్మ ఫలాలను కూడా మనలో పెంపొందించుకుంటాం.

మనకు దేవుడే మార్గాన్ని ఏర్పాటు చేశాడు. మనం ధైర్యంగా ఆ మార్గంలో పరుగెత్తాలి. మనల్ని పిలిచిన దేవుడు నమ్మకమైనవాడని, మనల్ని గమ్యానికి చేరుస్తాడని విశ్వసించాలి. మన గమ్యం దేవుడు మనకోసం నిర్ణయించిన ప్రణాళికను నెరవేర్చడమే.

"మొట్టమొదటిగా నేను దేవుని బిడ్డనని గ్రహించాను. అది దేవుడు నాకోసం నిర్ణయించిన పరుగును పరుగెత్తడానికి నాకు స్వేచ్ఛను ఇచ్చింది." అని సిడ్నీ అంది.

## ముగింపు

ఒక బహుమతి గెలవడానికి తన ఒక్కడి కోసమే పరిగెతే క్రీడాకారుడి వలె కాకుండా, మనము తోటి విశ్వాసులతో కలిసి ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఈ పందెంలో పరుగెడుతున్నాము. పరలోక తండ్రి బిడ్డలుగా, మనము ఆయన స్వారూప్యంలోకి మార్చబడడమే మన తుది గమ్యం. మనందరం కలిసి సహోదరులలో జేష్ఠుడైన యేసు సిద్ధం చేసిన ఆ పరలోక రాజ్యానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాము. ఆ పట్టణానికి దేవుడే శిల్పియూ, నిర్మాణకుడునై యున్నాడు (హెబ్రీయులు 11:10, 11:16).

సిడ్నీ చెప్పినట్లుగా, "దేవుడు మనల్ని దేనికోసమైతే సృష్టించాడో, ఆ పనిని మనం చేసినప్పుడు ఆయన ఆనందిస్తాడు. గెలిచినా, ఓడినా లేదా డ్రా అయినా, ఏదైనా సరే పందెంలో మనం బాగా పరిగెత్తడమే ఆయనను మహిమపరచడం."

పౌలు వలె మనం కూడా "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు నీతికిరీట ముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" అని చెప్పడానికి దేవుడు మనకు సహాయం చేయును గాక (2 తిమోతి 4:7–8).

## బిబ్లియోగ్రఫీ


1. ఓవర్ కమింగ్ క్రాషెస్ త్రూ క్రైస్ట్, ఫాగ్రేల్ స్కై, ఏప్రిల్ 16, 2024.

   https://leadingsaints.org/overcoming-crashes through -christ/

2. గ్లోరీ ఆన్ ది ఫీల్డ్ అండ్ గ్రేస్ ఇన్ అవర్ హార్ట్స్ విత్ సిడ్నీ మెక్‌లాఫ్లిన్ లెవ్రోన్, జీసస్ కాలింగ్ పాడ్‌కాస్ట్, అక్టోబర్ 7, 2024.

   https://www.jesuscalling.com/podcast/glory-on-the-field-and-grace-in-our-hearts-with-sydney-mclaughlin-levrone-and-eugenecho/#:~:text =I%20don't%20believe%20that, so%20dominant %20in %20our %20 world

3. ఒలింపిక్ ట్రాక్ స్టార్ సిడ్నీ మెక్‌లాఫ్లిన్–లెవ్రోన్ క్రెడిట్స్ గాడ్ ఫర్ సక్సెస్, డంకన్ గిగి, ఆగస్టు 08, 2024.

   https://www.catholicnewsagency.com/news /258621/olympic-track-star-sydney-mclaughlin-levrone-credits-god-forsuccess#:~:text =Mc Laughlin %2DLevrone%2C%20a%20devout%20 Christian,interviews%20and%20across%20 social %20media


## తప్పక చదవాల్సిన పుస్తకం

1. ఫార్ బియాండ్ గోల్డ్: రన్నింగ్ ఫ్రమ్ ఫియర్ టు ఫెయిత్, సిడ్నీ మెక్‌లాఫ్లిన్ లెవ్రోన్.

**– సుజనా, నేషనల్ స్టాఫ్, ఉదయపూర్, రాజస్థాన్.**

అవగాహన

# జీవితకాలం నేర్చుకోవడం



(తరువాయి భాగం)

## జీవితాంతం నేర్చుకోవలసిన అవసరం ఏమి?

"నిన్నటి భోజనం నేటి అవసరాలకు కావాల్సిన శక్తిని అందించదు." మనము ప్రతిరోజు మన ప్రయత్నాలను, మన విజయాల స్థాయిని మెరుగు పరచుకోకపోతే, నిన్నటి మన అత్యుత్తమ ప్రదర్శన రేపటి అవసరాలకు సరిపోదు. ఒక్కోసారి, నేటి మన అత్యుత్తమ ప్రదర్శన కూడా రేపటి ప్రపంచంలో విజయం సాధించడానికి సరిపోక పోవచ్చు. జీవితాంతం నేర్చుకునేవారు తమ జీవితాలను నిరంతరం తమ అత్యుత్తమ ప్రదర్శన కన్నా మెరుగ్గా చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రతిరోజూ మన అత్యుత్తమ ప్రదర్శనను మించి మెరుగ్గా చేయాలనే ఈ సూత్రం ఆధ్యాత్మిక మరియు లౌకిక జీవితాలలో రెండింటిలోనూ వర్తిస్తుంది.

## జీవితంలోని ప్రతి రంగంలో నిరంతర అభ్యాసం

క్రైస్తవులు ఆధ్యాత్మిక, మేధోపరమైన, భావోద్వేగ, వ్యక్తిగత, ఆచరణాత్మక ఎదుగుదల వంటి జీవితంలోని ప్రతి రంగంలో నేర్చుకునే అలవాటును పెంపొందించుకోవాలి. జీవితాంతం నేర్చు కోవడం అనేది బైబిల్ సూత్రం మాత్రమే కాదు, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గం.

### 1. ఆధ్యాత్మికం

క్రైస్తవ విద్య క్రైస్తవులను జీవితాంతం నేర్చుకునే వారిగా మరియు పవిత్ర గ్రంథాలు, విశ్వాసాలు, చర్చి మరియు ప్రపంచ చరిత్ర, విభిన్న సంస్కృతులు, ప్రార్థించే విధానాలు, క్రైస్తవ సంప్రదాయాలు, మతవిశ్వాసాలు, సేవ, నాయకత్వం, ఆధ్యాత్మిక పరిపక్వత, సంబంధాలు, సామాజిక పోకడలు, ప్రస్తుత సంఘటనలను విశ్వాసంతో చూడడానికి ప్రేరేపిస్తుంది.

## ఆధ్యాత్మికంగా నేర్చుకోవడానికి కావాల్సిన మెట్లు

### ఎ) దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయండి

క్రైస్తవుని జీవితాంతం నేర్చుకోవడంలో, క్రీస్తు ద్వారా దేవుడిని తెలుసుకోవడం చాలా ముఖ్యం. దీని కోసం, లేఖన వాక్యాలను వినడం, చదవడం,

అధ్యయనం చేయడం, ధ్యానించడం మరియు గుర్తుంచుకోవడం అవసరం. దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయడం అనేది ఒకసారి నేర్చుకుని వదిలేసే విషయం కాదు. మన జీవితంలో మొదట నేర్చుకున్న జ్ఞానంతోనే మిగిలిన జీవితమంతా బ్రతికేయ్యడం సరియైన ఆలోచన కాదు.

"దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసే ప్రతి విద్యార్థి దేవుని వాక్యంతో మరియు దేవుని ప్రపంచంతో మనం ఏమి చేయాలో తెలిపే ఆరు అలవాట్లను ఏర్పరచుకోవాలి. అవి పరిశీలన, అవగాహన/వివరణ, అన్వయం, మూల్యాంకనం మరియు భావ వ్యక్తీకరణ." – జాన్ పైపర్.

ఈ విధంగా మనం భక్తి, చారిత్రక, సాహిత్య మరియు వేదాంత కోణాల ద్వారా లేఖనాలను చదవవచ్చు మరియు చర్చించవచ్చు.

బైబిల్ పఠనం కోసం మీ వనరులను వైవిధ్య పరచుకోండి

* **బైబిల్ అధ్యయనం (Bible Study):** బైబిల్‌ను లోతుగా అర్థం చేసుకోవడానికి వ్యాఖ్యానాలు, బైబిల్ నిఘంటువులు మరియు స్టడీ గైడ్‌లను ఉపయోగించండి. ఉదాహరణకు, NBC, NBD మరియు "ప్రభుతో ప్రభాతము" వంటి పుస్తకాలు మీకు సహాయపడతాయి. అంతేకాకుండా, గ్రూప్ బైబిల్ స్టడీస్‌కు హాజరు కావాలి.
* **వేదాంతం (Theology):** క్రైస్తవ విశ్వాసం యొక్క సిద్ధాంతాలను నేర్చుకోండి. ఇది బలమైన పునాదిని నిర్మించుకోవడానికి సహాయపడుతుంది. క్రమబద్ధమైన వేదాంతంపై సిఫార్సు చేయబడిన పుస్తకాలు చదవండి, ప్రసిద్ధ దైవజనుల ప్రసంగాలు వినండి మరియు క్రైస్తవ నమ్మకాలపై కోర్సులు చేయండి.
* **అపోలోజెటిక్స్ (Apologetics):** మీ విశ్వాసాన్ని సమర్థించడానికి, ఇతరులతో ఆలోచనాత్మకంగా సంభాషించడానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి.

**బి) ప్రార్థన**

ప్రార్థన అనేది దేవునితో మాట్లాడే ఒక మార్గం. ఇది మన హృదయాలను ఆయనకు తెరిచి, మన అవసరాలను, కృతజ్ఞతలను మరియు విన్నపాలను తెలియజేసే అవకాశం. వివిధ రకాల ప్రార్థన విధానాలను నేర్చుకోవడం చాలా ముఖ్యం. ఉపవాసం, ఆరాధన వంటి వాటి ద్వారా దేవునితో మరింత లోతైన అనుబంధాన్ని పెంచుకోవచ్చు. ఈ విషయంలో వెస్లీ ఎల్. డ్యూయెల్ రచించిన "మైటీ ప్రివెయిలింగ్ ప్రేయర్" వంటి పుస్తకాలు చదవడం ద్వారా ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను మరియు వివిధ విధానాలను అర్థం చేసుకోవచ్చు.

**సి) వ్యక్తిత్వ వికాసం మరియు శిష్యత్వం**

* **పరిశుద్ధత (Holiness):** యేసు కొండపై చేసిన ప్రసంగంలో బోధించినట్లుగా పరిశుద్ధతను నేర్చుకోవడం చాలా అవసరం. దీనికి ఒక మార్గం ఏమిటంటే, జవాబుదారీతనం కోసం ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం (మెంటార్ – మెంటీ సంబంధం).
* **ఆత్మ ఫలాలను పెంపొందించుకోవడం (Cultivating the Fruit of the Spirit):** గలతీయులకు వ్రాసిన పత్రిక 5:22-23 లో చెప్పినట్లుగా, ప్రేమ, సంతోషం, సమాధానం, ఓర్పు, ఆత్మనిగ్రహం వంటి ఆత్మ ఫలాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి.
* **సేవక నాయకత్వం (Servant Leadership):** వినయంతో, సేవా భావంతో నాయకత్వం వహించడం నేర్చుకోవాలి. బైబిల్లోని నాయకత్వ సూత్రాలను మరియు సమకాలీన క్రైస్తవ నాయకత్వ వనరులను అధ్యయనం చేయాలి.
* **నైతిక జీవనం (Ethical Living):** రోజువారీ నిర్ణయాలలో మరియు సవాళ్లలో బైబిల్ సూత్రాలను ఎలా వర్తింపజేయాలో అర్థం చేసుకోవాలి.
* **క్రమశిక్షణ (Discipline):** ఒక శిష్యుడు క్రమశిక్షణ కలిగి ఉండాలి. కాబట్టి, సమయ పాలన మరియు ఆహారపు అలవాట్లలో క్రమశిక్షణను పాటించడం నేర్చుకోవాలి.

**డి) బోధించడం మరియు ప్రసంగించడం**

క్రీస్తు సందేశాన్ని సమర్థవంతంగా తెలియజేయడానికి నేర్చుకోండి. మీరు ఎవరికి పరిచర్య చేస్తున్నారో వారి సాంస్కృతిక నేపథ్యాలను అర్థం చేసుకోండి. అవగాహన వంతెనలు నిర్మించ డానికి సాంస్కృతిక పద్ధతులను నేర్చుకోండి. అదనంగా, ఇతర మతాలు, ప్రపంచ దృక్పథాలు మరియు ప్రస్తుత సమస్యల గురించి తెలుసుకోండి. మనలో

చాలామంది ఇతరుల నుండి ఉపన్యాసాలను కాపీ చేయడం ద్వారా సెకండ్-హ్యాండ్ సందేశాలను బోధిస్తున్నారు. దేవుని దగ్గర నుండి పొందిన సందేశాలే ఎంతో విలువైనవి.

మార్టిన్ లాయిడ్-జోన్స్ చెప్పినట్లు, బోధకుడు దేవుని నుండి ప్రజలకు సందేశాన్ని అందించే వ్యక్తి. అతను ప్రజలను అలరించడానికి అక్కడ లేడు. అభిప్రాయాన్ని పెంపొందించే డిజిటల్ వెర్షన్‌లు, ప్రింట్ వెర్షన్‌లు, గ్రూప్ డిస్కషన్‌లు మరియు థెరపీ సెషన్‌ల ద్వారా బోధన భర్తీ చేయబడినప్పుడు ప్రమాదం వస్తుంది.

డాక్టర్ లాయిడ్-జోన్స్ వివరించినట్లు, బోధన అనేది లిఖితమైన లేఖనం ద్వారా దేవుని మనసును ప్రజలకు అందించే ఒక సాధనం. ఇది ఒక నమ్మకమైన బోధకుని ద్వారా అందించబడుతుంది. కాబట్టి, ఒక ఉపన్యాసం బోధించడానికి, సిద్ధం చేయడానికి పరిశుద్ధాత్మకు అవకాశం ఇవ్వండి. గూగుల్ లేదా చాట్‌జిపిటిపై ఆధార పడటం కంటే దేవునిపై ఆధారపడటం చాలా ముఖ్యం.

### ఇ) సౌవార్తీకరణ

నశించే ఆత్మల కోసం ఒక అభిరుచిని కలిగి ఉండండి. సువార్త ప్రకటన కోసం కష్టపడి పనిచేయండి. సువార్త వ్యూహాలను అధ్యయనం చేయండి మరియు మిషన్ శిక్షణలలో పాల్గొనండి.

### ఎఫ్) సంబంధాలు

* అందరితో సత్సంబంధాలు కొనసాగించడం నేర్చుకోండి.
* ఇతరుల అవసరాలు మరియు దృక్కోణాలను అర్థం చేసుకోవడంలో ఎదగండి.
* బైబిల్‌ను అనుసరించి ప్రేమతో వివాదాలను పరిష్కరించుకోవడం నేర్చుకోండి.
* క్రీస్తు-కేంద్రీకృత గృహాన్ని నిర్మించడానికి నైపుణ్యాలను అభివృద్ధి చేయండి.

## 2. సెక్యులర్

ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ మరియు సామాజిక మార్పులు, జీవితాంతం నేర్చుకోవల్సిన అవసరాన్ని, సృజనాత్మకతను పెంపొందించుకోవల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. పాఠశాల, కళాశాల లేదా విశ్వవిద్యాలయంలో పొందిన నైపుణ్యాలు, జ్ఞానాన్ని ఉపయోగించి మాత్రమే ప్రజలు తమ జీవిత ప్రయాణాన్ని కొనసాగించలేరు.

### ఎ) డిజిటల్ టెక్నాలజీలలో అభివృద్ధి (Developments in Digital Technologies)

* ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు (AI), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మరియు బ్లాక్‌చెయిన్ వంటి కొత్త సాంకేతికతలు, ప్రస్తుత ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు మరియు సామర్థ్యాలను గణనీయంగా మారుస్తున్నాయి. దీని కారణంగా సాధారణ, తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయి.
* ఆధునిక సాంకేతికత యొక్క నెట్‌వర్క్ స్వభావం, AI తో కలిపి, మన పరస్పర చర్యలు, సమాచార మార్పిడి, మీడియా మరియు వినోదాన్ని లోతుగా ప్రభావితం చేసే విధంగా మారుస్తోంది.

### బి) ఉద్యోగ ప్రపంచంలో మార్పులు (Transformations in the World of Work)

వేగవంతమైన మరియు విస్తృత శ్రమ మార్కెట్ మార్పుల నేపథ్యంలో, కార్యాలయం కూడా ఒక అభ్యాస ప్రదేశంగా మారుతోంది. కార్యాలయంలో అధునాతన నైపుణ్యాలు, సృజనాత్మకత మరియు అనుకూలతకు డిమాండ్ పెరుగుతోంది.

UNESCO కృత్రిమ మేధస్సు యొక్క నైతికతపై (UNESCO, 2021) ఒక సిఫార్సును జారీ చేసింది. డిజిటల్ సమాజాలలో జీవించడానికి కొత్త విద్యా విధానాలు, నైతిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన, బాధ్యతాయుతమైన నమూనా పద్ధతులు మరియు శ్రమ మార్కెట్ మరియు ఉపాధికి సంబంధించిన చిక్కులను దృష్టిలో ఉంచుకుని కొత్త నైపుణ్యాల అవసరాన్ని నొక్కి చెప్పింది.

ఆటోమేషన్ కూడా ఉద్యోగ ప్రపంచాన్ని అధిక తీవ్రతతో ప్రభావితం చేస్తుంది. 2020ల ప్రారంభంలో సుమారు 3 శాతం ఉద్యోగాలు ఆటోమేషన్ ప్రమాదంలో ఉండగా, 2030ల మధ్య నాటికి ఇది 30 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

### సి) జనాభా మార్పులు (Demographic Changes)

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, 2020లో 65 ఏళ్ళు పైబడిన వారి సంఖ్య 727 మిలియన్లు. 2050 నాటికి వృద్ధుల

సంఖ్య యువకుల సంఖ్యను మించిపోతుంది. చాలా దేశాలలో ప్రజలు ఎక్కువ కాలం పని చేస్తున్నారు, పదవీ విరమణ వయస్సును కూడా పెంచుతున్నారు. వృద్ధాప్యంలో కూడా చురుకుగా పనిచేసేవారి సంఖ్య పెరుగు తుండటంతో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం మరియు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం చాలా అవసరం అవుతోంది.

సామెతలు 22:29 “తన పనిలో నేర్పరి అయిన మనుష్యుని నీవు చూచితివా? అతడు రాజుల యెదుట నిలుచును; అల్పుల యెదుట నిలువడు” దేవుడు మన సామర్థ్యానికి మించి నైపుణ్యాలను పెంచుకోవాలని చెప్పాడు. మీ నైపుణ్యాలు, ప్రతిభ దేవునికి చాలా ముఖ్యం (బేసలేలు, నిర్గమ 31:1).

ప్రపంచంలోని సాంకేతికత, ఉద్యోగం, జనాభా, వాతావరణం, ఆరోగ్యం, పౌర బాధ్యతలలో వస్తున్న మార్పులు నేర్చుకోవడంపై ఎలా ప్రభావం చూపుతున్నాయో మనం చూడ వచ్చు. జీవితాంతం నేర్చుకోవడం (LLL) అనేది ప్రస్తుత, భవిష్యత్ సవాళ్లకు చాలా అవసరం మరియు ఇది ప్రతి ఒక్కరిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం నిరుద్యోగాన్ని, దాని వలన కలిగే మానసిక ప్రభావాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి, ఈ క్రింది రంగాలలో మనం ఎదుగుదాం.

### 1. వృత్తి మరియు నైపుణ్య అభివృద్ధి (Professional and Vocational Development)

* **నైపుణ్యాభివృద్ధి (Skill Development):** దేవుణ్ణి మహిమపరచడానికి మరియు ఇతరులకు సేవ చేయడానికి మీ పనితీరును మెరుగుపరుచుకోండి. మీ రంగంలో ధృవీకరణలు, శిక్షణా తరగతులు మరియు మార్గదర్శకత్వం పొందండి.
* **పని ప్రదేశంలో నైతికత (Workplace Ethics):** మీ విశ్వాసాన్ని సమగ్రతతో మరియు అత్యుత్తమంగా మీ వృత్తిలో భాగం చేయండి. పనికి సంబంధించిన బైబిల్ సూత్రాలను అధ్యయనం చేయండి మరియు విశ్వాసం మరియు పనికి సంబంధించిన సదస్సులకు హాజరు అవ్వండి.
* **బాధ్యత (Stewardship:):** దేవుని మంచి నిర్వాహకుడిగా సమయం, డబ్బు, వనరులను సమర్థవంతంగా నిర్వహించడం నేర్చుకోండి. ఆర్థిక ప్రణాళిక, సమయ నిర్వహణపై కోర్సులు తీసుకోండి.
* **కమ్యూనికేషన్ నైపుణ్యాలు (Communication Skills):** కోర్సులు తీసుకోవడం ద్వారా లేదా ఆన్‌లైన్ తరగతులను చదవడం, వినడం ద్వారా మీ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి మరియు అభ్యాసం కోసం కొత్త వేదికలకు అనుగుణంగా ఉండండి.

### 2. మేధో వికాసం (Intellectual Growth)

* **విమర్శనాత్మక ఆలోచన (Critical Thinking):** సంక్లిష్ట సమస్యల గురించి తార్కికంగా మరియు బైబిల్ ప్రకారం ఆలోచించే మీ సామర్థ్యాన్ని పెంచుకోండి. తత్వశాస్త్రం, క్షమాపణలు మరియు ప్రపంచ దృక్పథం ఏర్పడటంపై పుస్తకాలు చదవండి. సమాజంతో అర్థవంతంగా మెలగడానికి ప్రస్తుత సంఘటనలు మరియు సాంస్కృతిక పోకడల గురించి తెలుసుకోండి. నమ్మకమైన వార్తా మూలాలను అనుసరించండి మరియు వాటిని విశ్లేషించండి.

### 3. సైన్స్ మరియు టెక్నాలజీ

* శాస్త్రీయ ఆవిష్కరణలు, క్రైస్తవ మతం గురించి తెలుసుకోండి.

### 4. సృజనాత్మకత

* మీ పనిలో సృజనాత్మకతను పెంపొందించుకోండి. సృజనాత్మకత ఒక్కరోజులో రాదని, దీనికి ఎక్కువ సాధన అవసరమని గుర్తుంచుకోండి.

### 5. భావోద్వేగ మరియు మానసిక ఆరోగ్యం

* **స్వీయ-అవగాహన (Self-Awareness):** మీ భావోద్వేగాలు మీ విశ్వాసం మరియు పనితో ఎలా సరిపోతాయో అర్థం చేసుకోవడంలో వృద్ధి చెందండి. క్రైస్తవ భావోద్వేగ మేధస్సుపై పుస్తకాలు చదవండి. అవసరమైతే కౌన్సెలింగ్‌కు హాజరు అవ్వండి.
* **స్థితిస్థాపకత (Resilience):** నిరీక్షణ మరియు పట్టుదలతో సవాళ్లను ఎదుర్కోవడం నేర్చుకోండి. సహనం యొక్క బైబిల్

ఉదాహరణలను (ఉదా., యోబు మరియు పౌలు) అధ్యయనం చేయండి మరియు ఆధ్యాత్మిక క్రమశిక్షణలను పాటించండి.

* **మానసిక ఆరోగ్యం:** విశ్వాసం మానసిక శ్రేయస్సుతో ఎలా ముడిపడి ఉందో అర్థం చేసుకోండి. దేవునిపై ఆధారపడి మరియు ఆయన నుండి బలం పొందుతూ మిమ్మల్ని మీరు ఒత్తిడి లేకుండా చేసుకోండి.

**6. శారీరక ఆరోగ్యం మరియు శ్రేయస్సు**

* **శరీరం ఒక దేవాలయం:** దేవుడిని గౌరవించడంలో భాగంగా మీ శారీరక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుకోండి (1 కొరింథీ 6:19-20). శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోండి. శారీరక వ్యాయామాలు వయస్సు సంబంధిత వ్యాధులను నివారించడానికి లేదా నిర్వహించడానికి మీకు సహాయపడతాయి.

## నేర్చుకునే అలవాటును ఎలా వృద్ధి చేసుకోవాలి

1. **స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోండి:** మీరు ఏ రంగాలలో ఎదగాలనుకుంటున్నారో గుర్తించి, సాధించగల అభ్యాస లక్ష్యాలను ఏర్పరచుకోండి.
2. **స్థిరంగా ఉండండి:** క్రమం తప్పకుండా చదవడానికి, అధ్యయనం చేయడానికి లేదా కొత్త నైపుణ్యాలను అభ్యసించడానికి సమయాన్ని కేటాయించండి.
3. **సమాజంలో భాగంకండి:** ప్రేరణ పొందడానికి అధ్యయన బృందాలలో, ఆన్‌లైన్ కోర్సులలో లేదా వర్క్‌షాప్‌లలో చేరండి.
4. **దేవుని గైడెన్స్ కోసం ప్రార్థించండి:** మీ అభ్యాసానికి దేవుని మార్గనిర్దేశం చేయమని మరియు దానిని ఆయన మహిమ కోసం ఉపయోగించడానికి ప్రార్థించండి.
5. **నేర్చుకున్న వాటిని ఆచరించండి:** మీరు నేర్చుకున్న జ్ఞానాన్ని ఇతరులకు సేవ చేయడానికి, దేవుని మహిమను ఆచరణాత్మక మార్గాల్లో తెలియజేయడానికి ఉపయోగించండి.

## నేర్చుకునే పద్ధతులు/అభ్యాసాలు

వివిధ పరిస్థితులకు అనుగుణంగా మీ అభ్యాస శైలిని మార్చుకోవడం అంటే, మీరు నేర్చుకునే వాతావరణం, నేర్చుకుంటున్న విషయం మరియు మీ నిర్దిష్ట లక్ష్యాలకు తగినట్లుగా మీ విధానాన్ని మలచుకోవడం. దీన్ని సమర్థవంతంగా ఎలా చేయాలో ఇక్కడ తెలుసుకోండి.

### 1) వివిధ నేర్చుకోనే పద్ధతులను ఉపయోగించండి

* **దృశ్య అభ్యాసం (Visual Learning):** సంక్లిష్టమైన ఆలోచనల కోసం రేఖాచిత్రాలు, చార్టులు, మైండ్ మ్యాప్‌లను సృష్టించండి.
* **శ్రవణ అభ్యాసం (Auditory Learning):** ఉపన్యాసాలు, చర్చలు లేదా పాడ్‌కాస్ట్‌లను వినండి మరియు అవగాహనను బలోపేతం చేయడానికి సహచరులతో చర్చించండి.
* **చదవడం/రాయడం (Reading/Writing):** నోట్స్ తీసుకోండి, రీడింగ్‌లను సంగ్రహించండి లేదా అవగాహనను పెంచుకోవడానికి వ్యాసాలు రాయండి.
* **శారీరక అభ్యాసం (Kinesthetic Learning):** వాస్తవ-ప్రపంచ పనులు, ప్రయోగాలు లేదా అనుకరణల ద్వారా భావనలను వర్తింపజేయండి.

### 2) సాంకేతికతను ఉపయోగించుకోండి

విభిన్న శైలుల కోసం రూపొందించిన యాప్‌లు మరియు సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించండి, ఉదాహరణకు దృశ్య అభ్యాసకుల కోసం వీడియోలను లేదా శారీరక అభ్యాసకుల కోసం అనుకరణలను వాడండి. సందర్భాన్ని బట్టి ఈ-పుస్తకాలు, ఆడియోబుక్‌లు మరియు ఇంటరాక్టివ్ క్విజ్‌లను ఉపయోగించండి. కొత్త విధానాలకు తెరిచి ఉండండి.

### 3) ఆలోచించండి-జతకట్టండి-పంచుకోండి

ఒక ప్రశ్న లేదా సమస్య గురించి వ్యక్తిగతంగా ఆలోచించండి, భాగస్వామితో ఆలోచనలను చర్చించండి, ఆపై పెద్ద సమూహంతో పంచుకోండి. ఇంటరాక్టివ్ చర్చలకు సమయం కేటాయించడం ద్వారా సహకార అభ్యాసం కోసం దీనిని స్వీకరించండి. విశ్వసనీయమైన మరియు విభిన్న సమాచార వనరుల కోసం చూడండి మరియు చివరలో ఫీడ్‌బ్యాక్ లూప్‌లను కలిగి ఉండండి.

### 4) సమస్య ఆధారిత అభ్యాసం (PBL)

అభ్యాసకులు విమర్శనాత్మక ఆలోచన మరి

యు జట్టుకృషి నైపుణ్యాలను పెంపొందించడానికి నిజ-ప్రపంచ, ఓపెన్-ఎండెడ్ సమస్యలను పరిష్కరిస్తారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవటానికి విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగించడం మరియు సమస్య-పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం.

- **సమస్యను నిర్వచించండి:** సమస్య సంక్లిష్టత యొక్క వాస్తవికతను గుర్తించడానికి నిర్దిష్టంగా ఉండండి.
- **సమస్యను విశ్లేషించండి:** సమస్యను చిన్న, నిర్వహించదగిన భాగాలుగా విభజించండి. మూలకారణాన్ని అన్వేషించడానికి 'ఫైవ్ డబ్ల్యూస్' (ఏమిటి, ఎందుకు, ఎలా, ఎక్కడ, ఎప్పుడు) పద్ధతి లేదా ఇలాంటి సాంకేతికతలను ఉపయోగించండి. వాస్తవాలను అభిప్రాయాల నుండి వేరు చేయండి మరియు సంభావ్య బలహీనతలను వెలికి తీయడానికి మీ స్వంత తార్కిక ఆలోచనను సవాలు చేయండి.
- **పరిష్కారాలను అంచనా వేయండి:** ఆలోచనలను రూపొందించండి, లాజిక్‌ను ఉపయోగించండి, మెదడును ఉపయోగించి ఆలోచించండి మరియు పరిష్కారాలను రూపొందించేటప్పుడు భావోద్వేగాలపై కాకుండా ఆధారాలపై ఆధారపడండి. తీర్పు లేకుండా సాధ్యమైనంత ఎక్కువ పరిష్కారాలను జాబితా చేయండి. ప్రతి ఎంపిక యొక్క ప్రయోజనాలు మరియు అప్రయోజనాలను బేరీజు వేయడం ద్వారా లాభాలను మరియు నష్టాలను అంచనా వేయండి.

### 5) కాన్సెప్ట్ మ్యాపింగ్

ఒక అంశం యొక్క ముఖ్య అంశాలను వ్రాసి, రేఖాచిత్రాలను ఉపయోగించి భావనల మధ్య సంబంధాలను గీయండి మరియు చర్చ లేదా మరింత అన్వేషణ కోసం తెలిసిన వాస్తవాలకు వాటిని మ్యాప్ చేయండి.

## జీవితాంతం నేర్చుకోవడానికి అడ్డంకులు

నిరంతర అభ్యాస ప్రక్రియకు కొన్ని అడ్డంకులు ఆటంకం కలిగించవచ్చు.

### 1. స్వయం సమృద్ధి ( Self-Sufficiency)

మీకు ఇప్పటికే తగినంత "నాకు తెలుసునని" లేదా మరింత నేర్చుకోవాల్సిన అవసరం లేదని అనుకోవడం స్వయం సమృద్ధి. దేవుని జ్ఞానం అనంతమైనది కాబట్టి, నేర్చుకోవడం జీవితాంతం కొనసాగే ప్రక్రియ అని గుర్తించండి. సమస్త జ్ఞానం అంతిమంగా దేవుని నుండి వస్తుందని, దేవుని జ్ఞానంలో ఎదగడానికి మరియు ఆయనను మెరుగ్గా సేవించడానికి నేర్చుకోవడం ఒక సాధనమని అర్థం చేసుకోండి. నేర్చుకోకపోతే, ప్రజలు స్తబ్దంగా మారి, వారి పూర్తి సామర్థ్యానికి ఎప్పటికీ ఎదగలేరు.

సి.ఎస్. లూయిస్ చెప్పినట్లు ''మీరు నేర్చుకోవడం ఆపేసిన రోజే, మీరు ఎదగడం ఆపేస్తారు.'' కాబట్టి, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండండి.

### 2. మతపరమైన కార్యకలాపాలలో నిమగ్నమవ్వడం కారణంగా సమయ పరిమితులు

చర్చి కార్యకలాపాలు, పరిచర్య మరియు ఇతర మతపరమైన నిబద్ధతలలో చురుకుగా పాల్గొనడం వలన అదనపు అభ్యాస ప్రయత్నాలకు అందుబాటులో ఉన్న సమయం పరిమితం కావచ్చు.

- **సమర్థవంతమైన సమయ నిర్వహణ:** పనులకు ప్రాధాన్యత ఇవ్వండి మరియు మతపరమైన కార్యకలాపాలకు మరియు అభ్యాస కార్యకలాపాలకు సరిపోయే వాస్తవిక షెడ్యూల్‌ను రూపొందించండి. సమయ నిర్వహణ అంటే ఎక్కువ పనులు చేయడం కాదు; సరైన పనులు చేయడం. మీరు మీ సమయాన్ని ఎలా గడుపుతున్నారో గమనించండి; మీరు ఉత్తమమైన వాటిని ఆశించాలి, కానీ అనుకోనిదినేదైనా సంభవించిన సిద్ధంగా ఉండాలి (Track how you spend your time; you need to hope for the best but plan for the worst) (లూకా 14:28-30). సమయం గడిచిపోతుందనేది చేదు వార్త, కానీ మీరు దానిని నడిపించే పైలట్ అనేదే శుభవార్త.
- **వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించుకోండి:** మీ అందుబాటులో ఉన్న సమయం మరియు శక్తికి అనుగుణంగా సాధించగల అభ్యాస

లక్ష్యాలను నిర్వచించండి, అతిగా నిబద్ధతను నివారించండి.

**3. మార్పు లేదా తెలియని వాటి గురించి భయం**

క్రొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రతి ఘటన, తప్పులు చేయడం, కొత్త దృక్కోణాలను ఎదుర్కోవడం లేదా మీ సౌకర్యవంతమైన ప్రాంతం నుండి బయటకు రావడం వంటి భయాల నుండి వస్తుంది.

* ఆధ్యాత్మికంగా స్తబ్దంగా ఉండటం లేదా వృద్ధి మరియు అభ్యాసం పట్ల ఉదాసీనంగా ఉండటం.

  "మీ ఆసక్తిలో ఎన్నడూ వెనుకబడకండి, కానీ మీ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కొనసాగించండి, ప్రభువును సేవిస్తూ ఉండండి." (రోమా 12:11)

* స్ఫూర్తిదాయకమైన క్రైస్తవ గురువులు లేదా జవాబుదారీతనం కలిగిన భాగస్వాములతో మిమ్మల్ని మీరు చుట్టుముట్టుకోండి.

**4. పరధ్యానాం మరియు బిజీ**

రోజువారీ బాధ్యతలతో నిమగ్నమై ఆధ్యాత్మిక అభ్యాసానికి తక్కువ సమయం ఇవ్వడం ఆధ్యాత్మిక మరణానికి కారణమవుతుంది. లౌకిక జ్ఞానాన్ని దేవుని వాక్యం, ప్రార్థన యొక్క లోతైన అధ్యయనంతో సమతుల్యం చేయడం ముఖ్యం. మీ అభ్యాస లక్ష్యాల ను దేవుని ఉద్దేశాలు, ప్రాధాన్యతలతో సమలేఖనం చేయండి.

"ముందుగా దేవుని రాజ్యం మరియు ఆయన నీతిని వెదకండి, అప్పుడు మీకు ఇవన్నీ ఇవ్వబడతాయి." (మత్తయి 6:33)

**అధిగమించే మార్గాలు**

* **ప్రాధాన్యత మరియు షెడ్యూల్:** ఆధ్యాత్మిక కార్యకలాపాలకు, అభ్యాసానికి నిర్దిష్ట సమయాలను కేటాయించండి. రెండింటినీ నిర్లక్ష్యం చేయకుండా మీ షెడ్యూల్‌ను బ్యాలెన్స్ చేసుకోండి.
* **సమయాన్ని వృథా చేసే వాటిని గుర్తించి నివారించండి:** సోమరితనం, టెలివిజన్, ఈమెయిల్/సోషల్ మీడియా, షార్ట్స్, రీల్స్, వెబ్ సర్ఫింగ్, గాసిప్స్, ఆందోళన, అంతరాయాలు, ఊహించని సందర్శకులు, ఫోన్ సంభాషణలు, అద్దం/అలంకరణ మరియు ఫ్యాషన్ వంటి వాటిని గుర్తించి వాటిని నివారించండి.
* **నిజంగా ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టండి:** సమయాన్ని వృథా చేసే వాటి నుండి సమయాన్ని తిరిగి పొందేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించండి.

**5. పరిశుద్ధాత్మ పాత్రను నిర్లక్ష్యం చేయడం**

పరిశుద్ధాత్మ సహాయం లేకుండా ఆధ్యాత్మికంగా ఎదగడానికి ప్రయత్నించడం నిష్ఫలమవుతుంది. "పరిశుద్ధాత్మ, తండ్రి నా నామమున పంపు ఆదరణకర్త, అన్ని విషయములను మీకు బోధించును" (యోహాను 14:26).

* మీ అభ్యాసంలో పరిశుద్ధాత్మ మార్గదర్శకత్వం కోసం క్రమం తప్పకుండా ప్రార్థించండి.
* మీరు లేఖనాలు లేదా ఇతర విషయాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఆత్మ యొక్క ప్రేరేపణ మరియు నిర్దేశానికి సిద్ధంగా ఉండండి.

**ముగింపు**


మనం జీవితాంతం నేర్చుకునే ప్రతి అంశానికీ శాశ్వతమైన పరిణామాలు కలిగి ఉంటాయి. వాటి ప్రతిఫలాలే మనం సాధించే మానవ లక్ష్యాలైన ఆధ్యాత్మిక లక్షణాలు, విజయాలు. మనం జీవితాంతం నేర్చుకునే ముఖ్యమైన విషయాలు పరీక్షల్లో వచ్చే మార్కుల రూపంలోనో, డిగ్రీల రూపంలోనో, పొందే గౌరవాల రూపంలోనో కనిపించకపోవచ్చు. కానీ, మనం ఎలా మారాము, మన వ్యక్తిత్వం ఎలా అభివృద్ధి చెందింది అనే దానిలో మాత్రం తప్పకుండా కనిపిస్తుంది.

**రిఫెరెన్సులు:**


1. వర్క్ ఫర్ ఏ బ్రైటర్ ఫ్యూచర్, గ్లోబల్ కమిషన్ ఆన్ ది ఫ్యూచర్ అఫ్ వర్క్, ఐ.ఎల్.ఓ (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) 2019.
2. లైఫ్‌లాంగ్ లెర్నింగ్ – జాన్ పైపర్
3. మేకింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఏ రియాలిటీ – యునెస్కో



– బి. సెల్విన్ జోన్స్
డిప్యూటీ డైరెక్టర్, టి.జి.ఎల్.ఐ (ఆర్థిక శాఖ)
గ్రాడ్యుయేట్, మల్కాజ్‌గిరి జోన్



# సోమరితనం

ఒకానొక ఊరిలో రాకేష్ అనే ఒక యువకుడు ఉండేవాడు. అతను చాలా తెలివైనవాడు, కానీ సోమరితనం అతనిని కట్టిపడేసింది. ప్రతి ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం, పనులు వాయిదా వేయడం అతనికి అలవాటుగా మారింది. చదువుకోవాల్సిన సమయంలో ఆటలాడుతూ, పని చేయాల్సిన సమయంలో నిద్రపోయేవాడు. అతని సోమరితనం కారణంగా, అతను చాలా అవకాశాలను కోల్పోయాడు. రోజులు గడుస్తున్నా అతనిలో ఏ మార్పు రాలేదు. తన అలవాటును మార్చుకోవడానికి అతనికి మనసు ఒప్పేది కాదు. తన భవిష్యత్తును తానే నాశనం చేసుకున్నాడు. ఆఖరికి, పశ్చాత్తాపం తప్ప అతని దగ్గర ఏమీ మిగలలేదు.

### 1. సోమరితనం అంటే ఏమిటి?

బద్ధకం, అలసత్వం, పని చేయాలనే ఆలోచన లేకపోవటం లేదా శక్తిని ఉపయోగించడానికి ఇష్టపడకపోవటం. ఒక రకంగా చెప్పాలంటే, ఏ పనీ లేకుండా ఖాళీగా ఉండటానికి ఇష్టపడటమే సోమరితనం. దీనికి ముఖ్య కారణం, ప్రేరణ లేకపోవడం మరియు పని చేయాలనే ఆసక్తి లేకపోవడం.

### 2. పనికి ఆధారం దేవుడే

మన దేవుడు నిరంతరం పనిచేస్తూనే ఉంటాడు. ఆయన ఎప్పుడూ విశ్రాంతి తీసుకోడు. సోమరితనం దేవుని లక్షణానికి పూర్తిగా వ్యతిరేకం. దేవుడు 'యెహోవా యీరే' అంటే మన అవసరాలు చూసుకునేవాడే కానీ, ఆదిలో ఆదాముకు ఏదెను తోటలో పని చేయమని, పతనం తరువాత కూడా తన ఆహారం కోసం కష్టపడి పనిచేయమని చెప్పాడు. అంటే, పని చేయడం అనేది దేవుని ఆజ్ఞ అని స్పష్టమవుతుంది.

### 3. విద్యార్థి జీవితంలో సోమరితనం

విద్యార్థి దశలో, చదువుతో పాటు ఇతర కార్య కలాపాలలో చురుకుగా పాల్గొనాలి. దేవునితో సమయం గడుపుతూ, పరిచర్యలో పాలు పంచు కుంటూ... అన్నింటినీ సమతుల్యం చేసుకోవాలి. ఇలాంటివారిలో సోమరితనం కనిపించదు. సోమరితనానికి గల కారణాలను, దాని పర్యవసానాలను తెలుసుకోకపోవటమే అసలైన సోమరితనం.

విద్యార్థులు చదువులో వెనుకబడటం మాత్రమే కాదు, తోటి విద్యార్థులకు సహాయం చేసే గుణం కూడా తగ్గిపోతోంది. గ్రాడ్యుయేట్లు క్యాంప్స్‌లో లేదా పరిచర్యల్లో పనిచేస్తుంటే, విద్యార్థులు వారిని చూస్తూ ఉండిపోతున్నారు, కానీ సహాయం చేయడానికి ముందుకు రావడం లేదు. పరిచర్య అనేది గ్రాడ్యుయేట్ల బాధ్యత అన్నట్లుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. బైబిల్ స్టడీ కోసం కొంత దూరం నడవాలన్నా, ప్రయాణం చేయాలన్నా కష్టంగా

భావిస్తున్నారు. కొందరికి బైబిల్ చదవడం కూడా భారంగా మారుతోంది. దైవభక్తిగల వ్యక్తులు రాసిన పుస్తకాలను క్రమంగా చదవకపోవడం ఆధ్యాత్మిక సోమరితనానికి దారితీస్తుందని జాక్ పూనెన్ అన్నారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ల వల్ల సోమరితనం మరింత పెరిగిపోయింది. పని లేకుండా ఖాళీగా ఉండే మనస్సు దెయ్యానికి స్థావరంగా మారుతుంది.

"ప్రజలలో సోమరితనం పెరుగుతూ వస్తోంది. ఇది సాలెపురుగు దారాల వలె మొదలై, ఇనుప గొలుసులు లాగా ముగుస్తాయి" – సర్ థామస్ బక్స్టన్.

సోమరులకు ప్రార్థన చేయడం ఎక్కలేనంత పెద్ద కొండగా ఉంటుంది. "సోమరి ప్రార్థన చేయడు, చేయలేడు, ప్రార్థన చేయడానికి ఇష్టపడడు, ఎందుకంటే ప్రార్థన శక్తిని కోరుతుంది" – ఇ.ఎం. బౌండ్స్

విద్యార్థి జీవితానికి విద్యార్థియే బాధ్యత వహించాలి, అది విజయం అయినా లేక వైఫల్యం అయినా. సోమరితనాన్ని విడిచిపెట్టి, చురుకుగా పనిచేయడం నేర్చుకుందాం. దేవుడు మనకు ఇచ్చిన సామర్థ్యాలను ఉపయోగించి, జీవితంలో ముందుకు సాగుదాం.

## 4. సోమరితనం – గుణాలు, ప్రభావాలు

అజాగ్రత్త, అసమర్థత, నిర్లక్ష్యం, అబద్ధాలు చెప్పడం, పనికిరాని కబుర్లు చెప్పడం, సుఖాల కోసం వెంపర్లాడటం, బద్ధకం, స్వార్థం, ఇతరుల ను నిందించడం – ఇవన్నీ సోమరితనం లక్షణాలు. ఇవి మనల్ని ముందుకు సాగనీయకుండా వెనక్కి లాగుతాయి. దీని ప్రభావాలను పరిశీలిద్దాం.

### ఎ) వాయిదా వేయడం

"రేపు చేద్దాంలే" అని పనులను వాయిదా వేయడం సోమరితనంలో ఒక భాగం. ఇది మనకు ప్రధాన అవరోధంగా మారుతుంది. సమయానికి నిర్ణయాలు తీసుకోలేకపోవడం వల్ల అవకాశాలను కోల్పోతాము, వనరులు సరిగ్గా ఉపయోగించుకోలేకపోతాము. సామెతలు 20:4లో చెప్పినట్లు, "విత్తులు వేయు కాలమున సోమరి దున్నడు; కోతకాలమున పంటనుగూర్చి వాడు విచారించునప్పుడు వానికేమియు లేకపోవును." అంటే, సరైన సమయంలో పని చేయకపోతే, ఫలితం దక్కదు.

### బి) విధులను నిర్లక్ష్యం చేయడం

బాధ్యతలను విస్మరించడం మనల్ని పేదరికానికి, నాశనానికి దారి తీస్తుంది. సామెతలు 24:33–34లో చెప్పినట్లు, "ఇంక కొంచెము నిద్ర, ఇంక కొంచెము కునుకుపాటు, పరుండుటకై ఇంక కొంచెము చేతులు ముడుచు కొనుట; వీటివలన నీకు దరిద్రత పరుగెత్తి వచ్చును, ఆయుధస్థుడు వచ్చినట్లు లేమి నీమీదికి వచ్చును." అంటే, సోమరితనంతో ఉంటే పేదరికం మనల్ని తరుముకుంటూ వస్తుంది.

### సి) నిద్రపై ప్రేమ

నిద్రపోవడం తప్పని కాదు, కానీ అధికంగా నిద్రపోవడం, సమయాన్ని వృథా చేసి ఉత్పాదకతను తగ్గిస్తుంది. సామెతలు 6:9–11లో చెప్పినట్లు, "సోమరీ, ఎందాక నీవు పండుకొని యుందువు? ఎప్పుడు నిద్ర లేచెదవు? ఇంకా కొంచెము నిద్రించె దనని కొంచెము కునికెదనని కొంచెముసేపు చేతులు ముడుచుకొని పరుండెదనని నీవనుచుందువు." అంటే, ఎక్కువ నిద్ర మనల్ని సోమరులుగా చేస్తుంది.

### డి) పనిని తప్పించుకోవడానికి సాకులు చెప్పడం

పని చేయకుండా ఉండటానికి రకరకాల సాకులు చెప్పడం కూడా సోమరితనంలో ఒక భాగం. సామెతలు 22:13లో చెప్పినట్లు, "సోమరి బయట సింహమున్నది, వీధులలో నేను చంపబడుదును అనుకొనును." అంటే, పని చేయకుండా ఉండటానికి ఏదో ఒక సాకు వెతుక్కుంటారు. పని చేయడానికి ఇష్టపడకపోవడం, ఒక అడుగు ముందుకు వేయడానికి భయపడటం కూడా సోమరితనానికి సూచనలే.

**ఇ) దేవుడు ఇచ్చిన ప్రతిభను నిర్వీర్యం చేయడం**

సోమరితనం మనల్ని దేవునికి దూరంగా చేస్తుంది. ప్రార్థన చేయడానికి, వాక్యం చదవడానికి, సువార్త ప్రకటించడానికి, దేవుని రాజ్యాన్ని వ్యాప్తి చేయడానికి దేవుడు మనకు ఇచ్చిన సామర్థ్యాన్ని, ప్రతిభను నిర్వీర్యం చేస్తుంది. సోమరులు తమ బాధ్యతలను ఇతరులపై మోపి సమాజానికి భారంగా మారుతారు.

సామెతలు 24:30-31లో చెప్పినట్లు, "సోమరివాని చేను యందంతట ముండ్ల తుప్పలు బలిసియుండెను, దూలగొండ్లు దాని కప్పియుండెను, దాని రాతి గోడ పడియుండెను." అంటే, సోమరులు తమకు అప్పగించిన పనులను సరిగ్గా చేయరు. కొంతమంది పనికిరాని పనులలో బిజీగా ఉంటూ తాము సోమరులం కాదని అనుకుంటారు, కానీ అది నిజం కాదు. నిజమైన పనిని విస్మరించడం కూడా సోమరితనమే.

## 5. సోమరితనం - దుష్పరిణామాలు

జీవితంలో విజయం సాధించాలంటే శ్రమ, ఓర్పు, పట్టుదల ఎంతో అవసరం. కానీ, సోమరితనం మనల్ని వెనక్కి లాగుతుంది. మన ఎదుగుదలను అడ్డుకుంటుంది. బద్ధకంతో ఉంటే కలిగే నష్టాల గురించి ఇప్పుడు మనం మాట్లాడుకుందాం.

**ఎ) పేదరికం**

సామె 10:4 లో చెప్పినట్లు, "బద్ధకముగా పని చేయువాడు దరిద్రుడగును, శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును." కష్టపడి పని చేయక పోతే పేదరికం మనల్ని వెంటాడుతుంది. కష్టపడి పనిచేయడం వల్లనే సంపద వస్తుంది.

**బి) నెరవేరని అవసరాలు**

సామెతలు 20:4 లో, "విత్తులు వేయు కాలమున సోమరి దున్నడు, కోతకాలమున పంటను గూర్చి వాడు విచారించునప్పుడు వానికేమియు లేకపోవును." అంటే, సమయం ఉన్నప్పుడు పని చేయకపోతే, అవసరమైన సమయంలో మనకు ఏమీ మిగలదు.

**సి) నాశనం**

సోమరితనం వల్ల మన ఆస్తులు, వనరులు కూడా నాశనమవుతాయి (సామె 24:32-34). నిర్లక్ష్యంగా ఉంటే మనకు ఉన్నవి కూడా పోతాయి.

**డి) అవకాశాలు కోల్పోవడం**

సరైన సమయంలో పనిచేయకపోతే, మనం చాలా మంచి అవకాశాలు కోల్పోతాము. అవకాశాలు దొరికినప్పుడు వాటిని ఉపయోగించుకోవడానికి మనము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

**డి) అవమానం, అపహాస్యం**

సామెతలు 12:24 లో "శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు, సోమరులు వెట్టి పనులు చేయవలసి వచ్చును." అని ఉంది. అంటే, సోమరులను అందరూ చిన్నచూపు చూస్తారు, వెక్కిరిస్తారు. కష్టపడి పనిచేసే వారికి సమాజంలో గౌరవం ఉంటుంది.

## 6. సోమరితనం - నివారణ మార్గాలు

మనిషి జీవితంలో సోమరితనం ఒక పెద్ద అవరోధం. దీనిని అధిగమించడానికి కొన్ని ముఖ్యమైన సూచనలు:

**ఎ) స్వీయ క్రమశిక్షణ:** మన పనులను మనమే క్రమపద్ధతిలో చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఇది సోమరితనాన్ని జయించడానికి మొదటి మెట్టు.

**బి) సూచనలను స్వీకరించాలి:** పెద్దలు చెప్పే మంచి మాటలు, ఉపదేశాలు మన జీవితానికి వెలుగునిస్తాయి. సామెతలు 6:23లో చెప్పినట్లు, "ఆజ్ఞ దీపముగాను, ఉపదేశము వెలుగుగాను ఉండును. శిక్షార్థమైన గద్దింపులు జీవమార్గములు." కాబట్టి, మంచి సూచనలను స్వీకరించాలి.

**సి) రోల్ మోడల్‌ను అనుసరించడం:** చీమలు తమ పనిని ఎంత శ్రద్ధగా చేసుకుంటాయో గమనించండి. సామెతలు 6:6 లో చెప్పినట్లు, "సోమరీ, చీమలయొద్దకు వెళ్లుము; వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము".

మనం కూడా శ్రద్ధగా పనిచేసేవారిని ఆదర్శంగా తీసుకోవాలి.

**డి) అహన్ని వీడాలి:** మన తప్పులను సరిదిద్దు కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఇది మన ఎదుగుదలకు సహాయపడుతుంది. అహం కారాన్ని వీడి, దిద్దుబాటును ఒక అవకాశంగా భావించాలి.

**ఇ) స్వీయ ప్రేరణ, సమయపాలన:** యేసుక్రీస్తు ప్రభువు 30 సంవత్సరాలు కష్టపడి పనిచేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, మనం కూడా మన పనులను సమయానికి పూర్తి చేయాలి. దూరదృష్టితో మన లక్ష్యాల ను ఏర్పరచుకోవాలి.

**ఎఫ్)దేవుని పట్ల భయం:** దేవునికి ఆధ్యాత్మిక గౌరవం ఇవ్వాలి. సామెతలు 9:10లో చెప్పినట్లు, "యెహోవాయందు భయభక్తులు గలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము; పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము." దేవుని పట్ల భయం కలిగి ఉండటం జ్ఞానానికి ప్రారంభం.

**జి) దేవునిపై ఆధారపడటం:** ఫిలిప్పీ 4:13లో చెప్పినట్లు, "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను." మన బలహీనతలో దేవుని బలంపై ఆధారపడాలి. పరిశుద్ధాత్మ సహాయం మనకు ఎల్లప్పుడూ ఉంటుంది.

**హెచ్)స్మార్ట్ లక్ష్యాలు:** ప్రతి రోజు మరియు ప్రతి వారం చేయాల్సిన పనులను స్పష్టంగా రాసుకోవాలి. ఒక నిర్దిష్టమైన దినచర్యను ఏర్పరచుకుని, కష్టమైన పనులను ముందుగా పూర్తి చేయాలి.

**ఐ) పరధ్యానం వద్దు:** సెల్ ఫోన్ వంటి వాటిని ఉపయోగించడానికి ఒక సమయం కేటాయించుకోండి. అవసరమైతే కొన్ని యాప్‌లను పూర్తిగా తీసివేయండి.

**జె) అభిరుచిని వెలికితీయండి:** జీవితంలో సోమరి తనానికి అభిరుచితో వ్యతిరేకంగా పోరాడాలి. దేవుడు మనల్ని తన ఉద్దేశం ప్రకారం ఉపయోగించుకోవాలంటే, సోమరితనాన్ని విడిచిపెట్టాలి. మనం మన తలాంతుల ను సక్రమంగా ఉపయోగించుకోకపోతే, సోమరితనానికి బానిసలుగా మిగిలిపోతాము.

## 7. ముగింపు

జీవితంలో ఎదుగుదలను అడ్డుకునే అతిపెద్ద అవరోధాలలో సోమరితనం ఒకటి. బద్ధకంతో ఉండిపోతే, మన గమ్యాన్ని చేరుకోవడం అసాధ్యం. క్రైస్తవ దృక్పథంలో, సోమరితనం ఒక పాపంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే, దేవుడు మనకు ప్రసాదించిన ప్రత్యేకమైన నైపుణ్యాలను, అవకాశాలను ఉపయోగించడంలో విఫలమైతే, అది దేవుని చిత్తానికి వ్యతిరేకం.

సోమరితనాన్ని జయించాలంటే, ముందుగా మనలో ఉన్న బద్ధకాన్ని గుర్తించాలి. ఆ తరువాత, దేవుని సహాయంతో క్రమశిక్షణ, పట్టుదల, ప్రార్థన ద్వారా దానిని విడిచిపెట్టడానికి ప్రయత్నించాలి. ప్రతిరోజూ చిన్న చిన్న పనులను క్రమం తప్పకుండా చేయడం ద్వారా సోమరితనాన్ని జయించవచ్చు. మనం దేవునిపై ఆధారపడినప్పుడు, ఆయన మనకు సహాయం చేస్తాడు. ఆయన కృపతో, మనం బద్ధకాన్ని జయించి, విజయతీరాలకు చేరుకోగలం.

### రిఫెరెన్సులు:


1. dictionary.cambridge.org/dictionary/english-telugu/laziness
2. https://uptoword.com/en/laziness-meaning-in-telugu
3. https://www.hindustantimes.com/business/all-the-ways-your-laziness-is-costing-you/story-IbVMuppHP8aLkSMudDYlqL.html
4. https://thinkaboutsuchthings.com/e-m-bounds-quotes-on-prayer/


**– డా॥ కె.శామ్యూల్ బాబు, గుంటూరు**



# చదవండి ఇలా మంచి మార్కులు మీ సొంతం

చదవటం అనేది ఒక సవాలుతో కూడుకున్న, అదే సమయంలో ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తుంది. ఒక ముఖ్యమైన పరీక్షకు సిద్ధమయ్యేటప్పుడు, మనం సరైన ప్రణాళిక లేకుండా, చదవడానికి అవసరమైన మెటీరియల్, గైడెన్స్ లేకుండా నేరుగా పరీక్షకు వెళ్లలేము కదా? అలా వెళితే, మనం ఆశించిన ఫలితాలను పొందలేము.

ఒక పద్ధతి ప్రకారం చదివితే, మనం చదివినది మనకు బాగా గుర్తుంటుంది. అంతేకాకుండా, పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది. చదివేటప్పుడు, కొన్ని నియమాలు పాటించడం చాలా అవసరం. ఆ నియమాలను మనం ఇప్పుడు తెలుసుకుందాం.

## చదువు మొదలు పెట్టే ముందు

మనం చదవడం మొదలు పెట్టడానికి ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుంచుకోవాలి. ఈ విషయాలు మనకు చదువులో విజయం సాధించడానికి సహాయపడతాయి.

1. **జ్ఞానం కోసం ప్రార్థించండి:** చదివే ముందు జ్ఞానం, దేవుని గైడెన్స్ కోసం ప్రార్థించండి. (యాకోబు 1:5).
2. **ప్రణాళిక సిద్ధం చేసుకోండి:** చదవడానికి నిర్దిష్ట లక్ష్యాలను, గడువులను ఏర్పరచుకోండి. ఏకాగ్రతతో చదవడానికి దేవుడిని సహాయం చేయమని అడగండి (సామె 16:3).
3. **చదువుకు కావలసిన వస్తువులు సిద్ధం చేసుకోండి:** పాఠ్యపుస్తకాలు, నోట్స్ మరియు చదువుకు సంబంధించిన ఇతర వస్తువులన్నీ సిద్ధం చేసుకోండి. (లూకా 14:28-30).

## సమర్థవంతంగా చదవటం ఎలా?

చదువు అనేది ఒక జ్ఞాన యాత్ర. ఈ యాత్రలో మనం విజయం సాధించాలంటే కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుంచుకోవాలి.

1. **అర్థం చేసుకోవడానికి దేవుని సహాయం కోరండి:** కష్టమైన విషయాలను అర్థం చేసుకోవడానికి, గుర్తుంచుకోవడానికి దేవుని సహాయం చేయమని అడగండి.
2. **క్రియాశీల అభ్యాస పద్ధతులను ఉపయోగించండి:** పాఠాలను చదివేటప్పుడు, కేవలం చదువుతూ వెళ్ళిపోకుండా, ముఖ్యమైన విషయాలను సొంత మాటల్లో రాయండి. మిమ్మల్ని మీరే ప్రశ్నలు అడుగుకుంటూ సమాధానాలు చెప్పే ప్రయత్నం చేయండి. ఈ విధంగా చదివితే, మీరు చదివిన విషయం బాగా గుర్తుంటుంది.
3. **గత పరీక్షల ప్రశ్నపత్రాలను లేదా క్విజ్‌లను**

**సాధన చేయండి:** పరీక్ష విధానం ఎలా ఉంటుందో తెలుసుకోండి. పరీక్షలకు ముందు, పాత ప్రశ్నపత్రాలను లేదా క్విజ్‌లను సాధన చేయండి. పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చదవడానికి, ప్రశాంతంగా ఉండడానికి దేవునికి ప్రార్థించండి (ఫిలిప్పీ 4:6-7).

4. **క్రమం తప్పకుండా పునశ్చరణ మరియు సాధన చేయండి:** క్రమం తప్పకుండా, చదివిన విషయాలను మళ్ళీ చదవడం వల్ల నేర్చుకున్నది మనస్సులో బాగా గుర్తుంటుంది (2 తిమోతి 2:15).

## సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం

1. **ప్రాధాన్యతలను నిర్ణయించడానికి దేవుని సహాయం కోరండి:** మీ చదువుకు సంబంధించిన అంశాలను, సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడానికి దేవుని సహాయం తీసుకోండి.
2. **ఒక పఠన ప్రణాళికను రూపొందించుకోండి:** చదవడానికి, విరామ సమయానికి వేర్వేరు సమయాలను కేటాయించుకోండి. వాటిని సరిగ్గా అనుసరించడానికి దేవుణ్ణి సహాయం చేయమని అడగండి.
3. **సమయ నిర్వహణ పద్ధతులను ఉపయోగించుకోవడానికి ఈ క్రింది పద్ధతులను ప్రయత్నించండి:**
   * **పొమోడోరో (Pomodoro):** ఈ పద్ధతిలో 25 నిమిషాల పాటు చదవడం, ఆ తర్వాత కొద్దిసేపు విరామం తీసుకోవడం ఉంటుంది. ఈ 25 నిమిషాల కాలాన్ని పొమోడోరో అంటారు.
   * **టైమ్ బ్లాకింగ్ (Time Blocking):** ఈ పద్ధతిలో రోజును వేర్వేరు సమయ భాగాలుగా విభజించి, ఒక్కో భాగాన్ని ఒక్కో పనికి కేటాయించాలి.
   * **80/20 సూత్రం (80/20 Rule):** ఈ సూత్రం ప్రకారం, మీ ప్రయత్నాలలో 20% నుండి 80% ఫలితాలు వస్తాయి. తక్కువ ప్రయత్నంతో ఎక్కువ ఫలితాలను పొందగలిగే వాటిపై దృష్టి పెట్టండి (కొలొస్స 4:5).
4. **చదవాల్సిన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి:** ముఖ్యమైన, కష్టమైన అంశాలపై దృష్టి పెట్టండి.

## ఏకాగ్రతతో మరియు ప్రేరణతో ఎలా చదవాలి?

1. **దేవుని సర్వాధిపత్యాన్ని గుర్తుంచుకోండి:** పరీక్షలు మరియు చదువుతున్న సమయంలో కూడా దేవుడు అన్నీ చూసుకుంటాడని నమ్మండి (రోమా 8:28).
2. **బలం మరియు సహనం కోసం దేవుని అడగండి:** చదవడం కష్టంగా ఉన్నప్పుడు కూడా, ప్రేరణతో, శ్రద్ధతో చదవడానికి దేవుని సహాయం కోరండి (యెషయా 40:31). దేవుడు మనకు శక్తిని, ఓర్పును ఇస్తాడు.
3. **విరామాలు తీసుకోండి మరియు స్వీయ సంరక్షణను పాటించండి:** క్రమం తప్పకుండా విరామాలు తీసుకోవడం, మన గురించి మనం శ్రద్ధ తీసుకోవడం వలన ప్రేరణ, ఏకాగ్రత నిలకడగా ఉంటాయి.
4. **చదవడానికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచుకోండి:** ఏకాగ్రతను చెడగొట్టే వాటిని తొలగించి, ప్రశాంతమైన ప్రదేశంలో చదవడానికి ప్రయత్నించండి.

## పరీక్షలకు ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు

పరీక్షలు దగ్గర పడుతున్న వేళ, ప్రశాంతంగా, నమ్మకంగా ఉండటం చాలా ముఖ్యం. మీ శ్రమకు ఫలితం దక్కాలంటే, కొన్ని ముఖ్యమైన సూచనలపై దృష్టి పెట్టండి.

1. **ప్రశాంతత కోసం ప్రార్థన:** పరీక్ష రోజున ప్రశాంతత మరియు ధైర్యం కోసం దేవుని ప్రార్థించండి (ఫిలిప్పీ 4:6-7).
2. **దేవుని మంచితనంపై నమ్మకం:** కష్టమైన పరీక్షలు మరియు చదువుల సమయంలో కూడా దేవుడు మనకు తోడుగా ఉంటాడని గుర్తుంచుకోండి (కీర్తన 100:5)..
3. **కృతజ్ఞత మరియు దేవునికి మహిమ:** మీరు

నేర్చుకున్న ప్రతిదానికీ, మీరు సాధించిన విజయాలకూ దేవునికి ధన్యవాదాలు చెప్పండి. మీ ప్రతి పనిలో ఆయనకు మహిమను తీసుకురండి (1 కొరింథీ 10:31).

4. **తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి:** తగినంత నిద్ర మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి మీ మెదడు చురుకుగా పని చేయడానికి, పరీక్షల సమయంలో మీరు ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది.

**ముగింపు**

ఖచ్చితమైన ప్రణాళిక ద్వారా చదవడం మొదలుపెడితే, అది చాలా సులభం అవుతుంది. సమయాన్ని సరిగ్గా వాడుకుంటూ, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు. చదివే సమయంలో ఏకాగ్రతతో ఉంటే, విషయాలు బాగా అర్థం అవుతాయి. దేవుడిపై నమ్మకంతో, ప్రార్థన చేస్తూ చదవటం మొదలుపెడితే, పరీక్షల్లో విజయం మీ సొంతం అవుతుంది.

రాజు దావీదు దేవుని కోసం ఒక ఆలయాన్ని నిర్మించాలని ఎలా ప్రణాళిక వేశాడో (1 దిన 28:2), మీరు కూడా మీ చదువులో గొప్ప విజయాలు సాధించడానికి ప్రణాళిక వేసుకోవాలి. కష్టపడి చదివి, మీ కెరీర్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుంటే ప్రభువును మహిమపరచిన వారవుతారు.

**– అనిల్ మాతంగి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్**
**వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, వరంగల్**

* * * * * *

# చిన్న బుచ్చుకోకు

చిన్న బుచ్చుకోకు పాట ఇవ్వలేదని
వేదిక మీద ప్రసంగ అవకాశం రాలేదని
మెప్పుల జల్లులో నీ పేరు వినబడలేదని
పరిచర్యలో నిన్ను మించి పోయారని

నీకంటే చిన్న వారైనా,
నీ కంటే ఎక్కువ పనులను చేయగా,
నీవు చింతింపనేలా?
వారి విజయం నీ సంతోషమని తెలుసుకో

పాపం నీ వాకిట పొంచియున్నదని
కావలివానిగా దేవుడే నిన్నే నియమించెనని
నీపై పాపానికి వాంఛ మెండుగా ఉండెనని
మనసును భద్రముగా కాపాడుకో
ప్రేమతో మసలుకో

జాగ్రత్త..... జర జాగ్రత్త,
ఓ సోదరా! ఓ సోదరి!
ఓ అన్నా... ఓ అక్కా... జర జాగ్రత్త!
మనది కాదు ఈ పని మరువకు ఎపుడూ!
ప్రభు పని ఇది...



మన విశ్వాస పరుగులో
ప్రభు పరిచర్య కాగడాను
మన తరం నుండి మరొక తరానికి
బాధ్యతగా అందించడమే మన పని
అంత మాత్రానికే ముఖం
చిన్న బుచ్చుకోవడమెందుకు?
ముఖం మాడ్చుకోవడమెందుకు?
జర్రంతా జాగ్రత్త!

**– రవికుమార్, గ్రాడ్యుయేట్, ఖమ్మం.**
**వీరు గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు.**

జీవితగాథ



# మేరీ జోన్స్

మేరీ జోన్స్ జీవిత కథ బైబిల్ సొసైటీ స్థాపనకు గొప్ప స్ఫూర్తి నిచ్చింది. మేరీ వేల్స్ దేశానికి చెందిన ఒక సాధారణ బాలిక. మేరీ జోన్స్‌కు 15 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఆమెకు ఒక బైబిల్ కావాలని కోరిక కలిగింది. ఆ రోజుల్లో బైబిల్స్ చాలా అరుదుగా దొరికేవి. ఒక వెల్ష్ బైబిల్ కొనుక్కోవడానికి ఆమె తన గ్రామం నుండి 26 మైళ్ళు (సుమారు 42 కిలోమీటర్లు) చెప్పులు లేకుండా నడిచింది.

ఆమె నిస్వార్థమైన అంకితభావం,బైబిల్ పట్ల ఆమెకున్న ప్రేమ అందరినీ కదిలించాయి. ప్రముఖ వెల్ష్ కీర్తన రచయిత్రి ఆన్ గ్రిఫిత్స్ (1776-1805)తో సమానంగా, మేరీ జోన్స్ 19వ శతాబ్దం చివరినాటికి జాతీయ గుర్తింపును పొందింది. ఆమె కథ ఒక చారిత్రాత్మక సంఘటనగా మిగిలిపోయింది.

### బాల్యం

మేరీ జోన్స్ 1784 డిసెంబర్ 16న లాన్ఫీ హాంగెల్-వై-పెన్నాంట్ అనే చిన్న గ్రామంలో జాకబ్, మేరీ (మోలీ) జోన్స్ దంపతులకు జన్మించింది. ఆమె వారి ఏకైక సంతానం. పుట్టిన కొద్దికాలానికే, వారి కుటుంబం లాన్ఫీ హాంగెల్ నుండి అర మైలు దూరంలో ఉన్న టైన్-వై-డ్డోల్ అనే కుటీరానికి మారింది.

ఆ ఇల్లు స్థానిక రాతితో కట్టబడింది. అది త్రాగునీటి కోసం, ఇతర అవసరాల కోసం ఒక జలాశయం పక్కన ఉంది. చలికాలంలో వంట చేయడానికి, వెచ్చగా ఉండటానికి అది ఎంతో ఉపయోగపడేది. వారి గ్రామానికి దగ్గరలో ఉన్న ఆబర్జినోల్విన్ పట్టణం 14 మైళ్ల దూరంలో ఉండేది. అక్కడికి నడవడానికి నాలుగు గంటలు పట్టేది.

మేరీ తల్లిదండ్రులు నిరుపేదలు, విద్య లేని పామరులు. ఆమె తండ్రి ఆస్తమాతో బాధపడు తున్నప్పటికీ, వ్యవసాయ కూలీగా కష్టపడి పనిచేసేవాడు. దురదృష్టవశాత్తు, ఆయన 30 ఏళ్ల వయసులోనే మరణించాడు.

ఆ రోజుల్లో చాలా మంది ఇళ్లలో ఉన్నట్టే, మేరీ వాళ్ళ ఇంట్లోనూ ఒక స్పిన్నింగ్ చక్రం ఉండేది. మిగతా పిల్లల్లాగే మేరీ కూడా చిన్నప్పటి నుంచే అనేక ఇతర విధులతో ఇంటి పనుల్లో తన వంతు సహాయం చేస్తూ ఉండేది.

### వేల్స్‌లో ఉజ్జీవం

సరిగ్గా చెప్పాలంటే, మేరీ జోన్స్ జన్మించడానికి

కొన్నేళ్ల ముందే ఆ ప్రాంతంలో ఒక గొప్ప ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసింది. దేవుడు హెూవెల్ హారిస్, డేనియల్ రోలాండ్, విలియం విలియమ్స్ (ఘనుడైన ఓ యెహెూవా, నాకు దారి చూపి నడిపించుము' అనే కీర్తన రాసిన వ్యక్తి) వంటి గొప్ప బోధకులను పంపాడు. వారు దేవుని కృపను గూర్చిన సందేశాన్ని విస్తారమైన జనసమూహానికి బోధించారు.

అయితే, ఈ బోధకులు చాలాసార్లు ప్రజల నుండి వ్యతిరేకతను, కష్టాలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, వేలాది మంది తమ తప్పులను తెలుసుకొని పశ్చాత్తాపపడ్డారు. క్రీస్తు సిలువపై చనిపోయి మనకు విమోచన కలిగించాడని నమ్మి రక్షణ పొందారు.

ఈ క్రొత్త విశ్వాసులలో చాలా మంది వారి స్థానిక పారిష్ చర్చిలలో సరైన ఆధ్యాత్మిక ఆహారాన్ని పొందలేకపోయారు. సరిగ్గా చెప్పాలంటే, వాళ్ళకు కావలసినంత దైవ సంబంధిత విషయాలు అక్కడ లభించలేదు. ఇది చివరికి “వెల్ష్ కాల్వినిస్టిక్ మెథడిస్ట్స్” అని పిలువబడే ఒక కొత్త విభాగం ఏర్పాటుకు దారితీసింది.

ప్రజలంతా కలిసి దేవుణ్ణి ఆరాధించడానికి అనేక ప్రార్థనా మందిరాలు కట్టారు. ఆ రోజుల్లో క్రైస్తవులు ఇళ్లల్లో కలుసుకునేవారు. దేవుని కృపను గూర్చిన తమ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకునేవారు. ఒకరినొకరు ప్రోత్సహించు కుంటూ, దైవ మార్గంలో ముందుకు సాగడానికి ప్రయత్నించేవారు.

## రక్షణానుభవం

మేరీ తల్లి మోలీ అబెర్గినోల్విన్ సమీపంలోని క్వర్ట్ (కోర్-టి) వద్ద సమీప కాల్వినిస్టిక్ మెథడిస్ట్ చాపెల్ సభ్యురాలు. దేవుని పరిశుద్ధ వాక్యమైన బైబిలు నుండి ప్రకటించబడే ఒక సందేశాన్ని వినడానికి మేరీ తన తల్లితో పాటు స్నేహితురాళ్ళతో కలిసి, ప్రతి వారం రెండు మైళ్ళ దూరం నడిచి వెళ్ళేది.

మేరీకి ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, దేవుడు తన కృపతో ఆమె హృదయాన్ని తాకి, రక్షణ కోసం క్రీస్తును మాత్రమే విశ్వసించేలా చేశాడు. రక్షణ నిశ్చయత కలిగిన ఆమెను మెథడిస్ట్ సొసైటీ సభ్యురాలిగా ఆమోదించారు.

## థామస్ చార్లెస్ సహకారం

ఆ దినాలలో జాన్ ఎలియాస్, క్రిస్మస్ ఎవాన్స్ లాంటి ఎంతోమంది యువకులు వాక్యాన్ని ప్రకటించడానికి దేవునిచే పిలువబడ్డారు. వీరిలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన రెవరెండ్ థామస్ ఛార్లెస్ కూడా ఒకరు. వీరంతా బకింగ్‌హామ్‌షైర్‌లోని ఓల్నీలో కొంతకాలం ఉన్నారు. ఇక్కడ జాన్ న్యూటన్ ('అమేజింగ్ గ్రేస్' కీర్తన రచయిత) మరియు ఆ పట్టణంలో సమయాన్ని వెచ్చించిన ఇతర ప్రసిద్ధ బోధకులు వారిని ప్రోత్సహించారు.

1783లో, ఛార్లెస్ ఉత్తర వేల్స్‌లోని బాలా పట్టణంలో తన సుదీర్ఘమైన, ఫలవంతమైన పరిచర్యను ప్రారంభించాడు. బాలా సరస్సు, పచ్చని కొండలతో ఆ ప్రాంతం ఎంతో అందంగా ఉండేది. అక్కడ ఆయన చేసిన సేవ ఎంతో గొప్పది.

కొన్నిసార్లు థామస్ చార్లెస్ బాలాలో దేవుని వాక్యాన్ని ప్రకటించగా వినడానికి దాదాపు రెండు వేల మంది వచ్చేవారు. కానీ ఆయన మాత్రం దానితో ఆగలేదు. దేశమంతటా ఉన్న ప్రజలకు సువార్త అందించాలనే తపనతో సుదూర ప్రాంతాలకు వెళ్ళేవాడు.

గోదాముల్లో, పొలాల్లో, వీధుల్లో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బోధించేవాడు. ఒక్కోసారి ఇరవై వేల మందికి పైగా గుమిగూడిన జనసమూహానికి బోధించేవాడు. ఆయన తరచూ మేరీ జోన్స్ వెళ్ళే ప్రార్థనా మందిరానికి కూడా ప్రకటించడానికి వచ్చేవాడు.

## సండే స్కూళ్ల ఏర్పాటు

ప్రజల ఆధ్యాత్మిక, విద్యా అవసరాలను తీర్చాలనే తపనతో థామస్ చార్లెస్ వారమంతా 'సర్క్యులేటింగ్ స్కూళ్లు', ప్రతి ఆదివారం 'సండే స్కూళ్లు' ఏర్పాటు చేశాడు. ఆయన గ్రామాలకు ఉపాధ్యాయులను పంపేవాడు. వారు అన్ని వయసుల వారు చదవడం, రాయడం నేర్చుకునేలా ప్రోత్సహించేవారు.

ఇంగ్లాండులోని ఆయన స్నేహితులు ఆర్థికంగా సహాయం చేయడంతో ఉపాధ్యాయులకు జీతం ఇవ్వగలిగారు. తద్వారా ఈ పాఠశాలలు ఉచితంగా నడిచేవి. అప్పుడప్పుడు థామస్ చార్లెస్ స్వయంగా పాఠశాలలను సందర్శించి పిల్లలను పరీక్షించేవాడు. బైబిల్ చదవడానికి, దానిలోని సందేశాన్ని తెలుసుకోవడానికి ప్రజలకు అవకాశం ఇవ్వాలనేది ఆయన గొప్ప ఆశయం.

రెవరెండ్ థామస్ చార్లెస్ బైబిల్‌లోని – పూర్తి అధ్యాయాలు, కొన్నిసార్లు మొత్తం పుస్తకాలను విద్యార్థులతో కంఠస్థం చేయించేవాడు. ఈ విద్యావిధానం ఎంతగా విజయవంతమైందంటే వేల్స్ యూరప్ లోనే అత్యధిక అక్షరాస్యత కలిగిన దేశాలలో ఒకటిగా నిలిచింది. వేలాది మంది ప్రజలు బైబిల్ చదివి జ్ఞానం పొందారు. ఈ పాఠశాలల ద్వారా ఎంతో ఆశీర్వదించబడ్డారు.

## బైబిల్‌తో పరిచయం

మేరీ తన పదవ జన్మదినానికి ముందు ఈ పాఠశాలలో ఒకటి ఆబర్జినోల్విన్ లో స్థాపించబడింది. ఆమె గురువు జాన్ ఎల్లిస్. ఆయన తరువాత, లూయిస్ విలియమ్స్ దగ్గర నేర్చుకునే అవకాశం లభించి నందుకు ఆమె సంతోషించింది. మేరీ వెల్ష్ బైబిల్ చదవడం, నేర్చుకోవడంలో అద్భుతమైన పురోగతి సాధించింది. ఇది బిషప్ విలియం మోర్గాన్ చే వ్రాయబడిన అద్భుతమైన అనువాదం. ఈ బైబిల్ 1588లో ప్రచురించబడింది. తరువాత 1620లో దీనిని సవరించారు. ఈ అనువాదం ఇంగ్లీష్ ఆథరైజ్డ్ (కింగ్ జేమ్స్) వెర్షన్ మాదిరిగానే నాణ్యత మరియు ఖచ్చితత్వం కలిగి ఉంది.

మేరీకి చదవడం రావడంతో, దేవుని వాక్యం పట్ల ఆమెకు మరింత ఆసక్తి, ప్రేమ పెరిగాయి. "నాకంటూ ఒక బైబిల్ ఉంటే బాగుండేది!" అని ఆమె తనలో తాను అనుకునేది. కానీ అది సాధ్యం కాదు. అయితే, అక్కడి స్థానిక రైతు భార్య శ్రీమతి ఎవాన్స్, పార్లర్‌లో తమ కుటుంబ బైబిల్ చదవడానికి సమయం దొరికినప్పుడల్లా మేరీని తన ఇంటికి ఆహ్వానించేది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మేరీ రెండు మైళ్ళు నడిచి వెళ్ళడానికి కూడా ఎంతో సంతోషించేది. వాతావరణం ఎలా ఉన్నా, ఆమె ఆ అవకాశాన్ని వదులుకునేది కాదు.

## దేవుని వాక్యము కొరకు ప్రయాణము

మేరీ కష్టపడి తన సొంత బైబిలు కొనుక్కోవడానికి మూడు షిల్లింగులు,ఆరు పెన్సులను దాచుకోవాలని నిశ్చయించుకుంది. నేటి విలువల ప్రకారం అది దాదాపు £40.3 ఉంటుంది. ఈ రోజుల్లో మనకు అది అంత పెద్ద మొత్తం కాకపోయినా, 18వ శతాబ్దం చివరలో పేదరికంలో ఉన్న ఒక అమ్మాయికి అది చాలా పెద్ద మొత్తం. అయినా ఆమె ఏమాత్రం నిరుత్సాహపడలేదు. ప్రతి నెలా కొంత డబ్బు ఆదా చేయడానికి కష్టపడింది. కోళ్లను పెంచి గుడ్లు అమ్మేది. తన తేనెటీగల గూడు నుండి తేనెను తీసి అమ్మేది. అలాగే కుట్టుపని కూడా చేసేది. ఒకరోజు ఆమెకు ఒక పర్సు దొరికింది. దానిని యజమానికి తిరిగి ఇచ్చేసింది. ఆమె నిజాయితీకి బహుమతిగా ఆరు పెన్సులు లభించడంతో ఎంతో సంతోషించింది.

ఒకానొక రోజున చార్లెస్ గారు, తాను లండన్ నుండి కొన్ని బైబిళ్లను తెప్పిస్తున్నానని, నిర్దిష్ట సమయానికి వస్తే మేరీ ఆ బైబిళ్లను పొందగలదని చెప్పాడు. రెవరెండ్ చార్లెస్ ఇరవై ఆరు మైళ్ళ దూరంలో ఉన్న బాలాలోని హై స్ట్రీట్ మధ్యలో ఉన్న ఒక పెద్ద ఇంట్లో ఉండేవాడు. ఆయన తన ఇంటిలోని పెద్ద గదిలో ప్రార్థన నిర్వహించి, ఉపాధ్యాయులను పట్టణాలకు, గ్రామాలకు పంపించే ముందు వారికి శిక్షణ ఇచ్చేవాడు. ఆ ఇంట్లోనే ఒక కిరాణా మరియు డ్రేపర్ దుకాణం కూడా ఉండేది. చార్లెస్ గారి భార్య సాలీ ఎంతో శ్రద్ధగా ఆ దుకాణాన్ని నడుపుతుండేది. బాలా పట్టణం ఉత్తర వేల్స్ లోని ముఖ్యమైన వ్యాపార కేంద్రాలలో ఒకటి. అక్కడ ఉన్నితో చేసిన దుస్తులను పెద్ద మొత్తంలో అమ్మేవారు.

అప్పటికి మేరీ జోన్స్‌కు దాదాపు పదహారేళ్లు ఉంటాయి. ఆమెకు బైబిల్ కావాలనే కోరిక బలంగా ఉంది. బైబిలు కొనుక్కోవడానికి సరిపడా డబ్బు కూడబెట్టింది. తనకంటూ ఒక బైబిల్‌ను సంపాదించుకోవడానికి, ఆ సుదీర్ఘ ప్రయాణాన్ని,

దారిలో ఎదురయ్యే ప్రమాదాలను ఆమె పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. అయినా, మేరీ తన ప్రయాణం మొదలు పెట్టింది. కాడెర్ ఇద్రిస్ పర్వతం మీదుగా నడుస్తూ, సరస్సులను దాటుకుంటూ తన గమ్యానికి చేరుకుంది.

కానీ అక్కడకు వెళ్ళేసరికి బైబిళ్లు ఇంకా రాలేదు. నిరాశ చెందకుండా, బైబిళ్లు వచ్చే వరకు తోటలోని ఆయన సేవకుని ఇంటిలో గడిపింది. చివరికి,ఆమె కల నెరవేరింది! ముప్పై మైళ్ళకు పైగా నడిచి వచ్చిన మేరీకి ఆయన మూడు బైబిళ్ళను ఇచ్చాడు. తాను పొందిన కష్టాలకంటే ఎక్కువ ఆనందంతో మరియు కృతజ్ఞతతో ఆమె తన గృహానికి బయలు దేరింది.

అనేక మంది బైబిల్ చదవడానికి ఆసక్తి కలిగి ఉన్నారని, వెల్ష్ భాషలో మరిన్ని బైబిళ్లను ప్రచురించాల్సిన అవసరం ఎంతో ఉందని థామస్ చార్లెస్‌కు స్పష్టమయింది. ఈ విషయాన్ని లండన్ లోని అతని స్నేహితులకు తెలిపారు. మరియు చాలా చర్చల తరువాత 1804లో బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ అని పిలువబడే ఒక కొత్త సంస్థ ఏర్పడింది. ప్రారంభ మద్దతుదారులలో విలియం విల్బర్ ఫోర్స్ ఉన్నాడు. అతడు బానిస వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడాడు. వెల్ష్ భాషలో బైబిళ్లను అందించడమే కాదు, ప్రపంచంలోని అనేక భాషా సమూహాలకు వీలైనన్ని ఎక్కువమందికి అందించడమే సొసైటీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

### మేరీ తరువాతి జీవితం

1813వ సంవత్సరంలో మేరీ జోన్స్, థామస్ అనే నేత కార్మికుడిని వివాహం చేసుకుంది. వారు పర్వతాలు, సెలయేళ్లు, దట్టమైన అడవుల గుండా ప్రయాణించి, ఎంతో రద్దీగా ఉండే, వస్త్రాల తయారీకి ప్రసిద్ధి చెందిన క్వర్ట్ అనే గ్రామంలో తమ కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

వారికి లూయిస్, మేరీ, జాకబ్, జాన్, ఎబెనెజర్ (బెన్నీ) అనే ఐదుగురు పిల్లలు జన్మించారు. దురదృష్టవశాత్తు, లూయిస్ 18 ఏళ్ల వయస్సులో, మేరీ దాదాపు 18 నెలల వయస్సులో, జాకబ్ 15 ఏళ్ల వయస్సులో, ఎబెనెజర్ చిన్నతనంలోనే క్షయవ్యాధి (టిబి) కారణంగా మరణించారు. ఆ రోజుల్లో క్షయవ్యాధి ఒక భయంకరమైన వ్యాధిగా ఉండేది. దీని బారినపడి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

మేరీ, థామస్‌ల ఆరుగురు పిల్లలలో జాన్ మాత్రమే యుక్తవయస్సు వరకు వచ్చాడు. పెరిగి పెద్దయ్యాక అతడు అమెరికాకు వలస వెళ్ళాడు. 1849లో మేరీ జోన్స్ కూడా క్షయవ్యాధి కారణంగా తన భర్త థామస్‌ను కోల్పోయింది.

మేరీ తన జీవిత చరమాంకంలో క్రగ్ అనే ప్రదేశంలో ఒక చిన్న కాటేజీలో నివసించింది. ఆమె క్రమేపీ అంధురాలిగా మారిపోవడంతో ఆమెకు ఎంతో ఇష్టమైన బైబిల్ చదువుకోలేకపోయింది. అలాంటి సమయంలో, బాలాకు చెందిన లిజ్జీ రోలాండ్స్ అనే ఒక యువతి మేరీ దగ్గర పని చేయడానికి వచ్చింది. బాలాకు చెందిన ఒక వ్యక్తి ద్వారా మేరీ జోన్స్ గురించి తెలుసుకున్న ఆమెకు మేరీ జోన్స్‌తో స్నేహం ఏర్పడింది. లిజ్జీ తరచుగా మేరీకి బైబిల్ చదివి వినిపించేది. 1864 డిసెంబరులో మేరీ ఈ లోక యాత్రను ముగించి ప్రభువు సన్నిధికి వెళ్ళింది. ఆమె భర్త సమాధిలోనే ఆమెను కూడా ఖననం చేశారు.

### ముగింపు

నేడు బైబిల్ సొసైటీ ద్వారా చాలా భాషల్లోకి బైబిల్ ముద్రించబడుతుంది. కొన్ని భాషల్లో ఇంకా అనువాదం జరుగుతుంది. ఈ రోజుల్లో బైబిల్ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంది. కానీ,దేవుని వాక్యాన్ని ధ్యానించడానికి మనం ఎంత ప్రాధాన్యతనిస్తున్నాం?

వాక్యం మన చేతుల్లో నుండి తీసివేయబడక ముందే మేలుకుందాం! దేవుని వాక్యాన్ని చదువుతూ, అందులోని సువార్తను అందరికీ ప్రకటిద్దాం. మేరీ జోన్స్ చిన్నప్పటి నుంచే తన పిల్లలకు దేవుని వాక్యాన్ని పరిచయం చేసినట్లుగా, మనం కూడా మన పిల్లలకు దేవుని వాక్యాన్ని పరిచయం చేద్దాం.

**(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించ బడినది)**

– రూత్ వినయ్,
ప్రగతినగర్, హైదరాబాద్



# వ్యక్తులు వ్యక్తిత్వాలు

**ఈ** లోకంలో మనం జీవిస్తున్నప్పుడు, ఎన్నో రకాల మనుషులను కలుసుకుంటాం. వారిలో కొందరు మనకు స్ఫూర్తినిస్తే, మరికొందరు మనకు పాఠాలు నేర్పుతారు. బైబిల్ గ్రంథంలో కనిపిస్తారు కొంతమంది వ్యక్తులు, వారి జీవితాలు నేటికీ మనకు ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తాయి. వారి గురించి తెలుసుకుందాం.

1. **యోబు (యోబు 31:1):** తన ఆంతర్యంలో కూడా అపవిత్రత వైపు అడుగు వేయడానికి ఇష్టపడని వ్యక్తి.
2. **యోసేపు (ఆది 37:16):** ఎలాంటి ఆజ్ఞలు లేకునప్పటికీ, తన ఆలోచనలలో కూడా అపవిత్రతకు తావు ఇవ్వని వ్యక్తి.
3. **దావీదు (కీర్తన 51):** తన జీవితంలో ఆజ్ఞను అతిక్రమించిన అపరాధాన్ని అలక్ష్యము చేయని వ్యక్తి
4. **సొలొమోను (ప్రసంగి 12):** విస్తారమైన జ్ఞానాన్ని సంపాదించిన తరువాత కూడా దేవుని యందు భయభక్తులు కలిగి, ఆయన ఆజ్ఞల ను అనుసరించి జీవించడమే మానవునికి శ్రేయస్సు అని గ్రహించిన వ్యక్తి. జీవిత సత్యాలను అనుభవపూర్వకంగా తెలుసు కున్నాడు.
5. **ఎలీషా (1 రాజులు 2:9):** తన ఎడ్లను విడిచి, ఎదురాడి ఏలీయా వెంట పరుగెత్తి రెండింతల ఆత్మను పొందిన వ్యక్తి.
6. **హనోకు (ఆది 5:22–24):** వందల యేండ్లు దేవునితో సహవాసాన్ని రుచి చూసి, మరణాన్ని రుచి చూడని వ్యక్తి.
7. **దానియేలు (దానియేలు 1:8):** అవిధేయతకు అవకాశమున్న పరిస్థితులలో కూడా దేవుని ఆజ్ఞను అతిక్రమించకూడదని నిశ్చయించుకున్న వ్యక్తి.
8. **సమ్సోను (నాయాధి 16):** బలహీనతలకు లోనై తన రహస్యాలను పంచుకోవడం ద్వారా అణచబడిన వ్యక్తి.
9. **అబ్రహాము (ఆది 22:1):** తనకున్నవాటిలో అత్యంత విలువైనదాన్ని దేవునికి సమర్పించ డానికి పరిశోధించబడి, దేవునికి విధేయత చూపడం ద్వారా విశ్వాసులకు తండ్రి అని పిలువబడిన వ్యక్తి.
10. **యాకోబు (ఇశ్రాయేలు) (ఆది 32:28):** దేవునితో పోరాడి, పెనుగులాడి గెలిచి, ప్రపంచ పటంలో తన పేరునే ఒకదేశంగా కలిగిన వ్యక్తి.
11. **నోవహు (ఆది 6:9):** నీతిమంతుడుగా, నిందారహితుడుగా తన తరములో దేవునితో నడిచిన వ్యక్తి.
12. **మోషే (సంఖ్యాకాండము 12:3):** సణుగులు, సంశయాలతో నిండిన సమాజం మధ్య కూడా, భూమి మీద ఉన్న వారందరిలో మిక్కిలి సాత్వికుడని దేవునిచేత సాక్ష్యం పొందిన వ్యక్తి.
13. **బాప్తిస్మమిచ్చు యోహాను (మార్కు 6:17):** పాపాన్ని గూర్చి హేరోదును, ప్రజలను హెచ్చరిస్తూ, ప్రభువు మార్గాన్ని తెలియజేసిన వ్యక్తి.

– త్రివేణి శ్రీను, రామంతపూర్ జోన్,
హైదరాబాద్



# పరుగో... పరుగు

వీకెండ్ కాసేపు నిద్రపోదామనుకుంటే, "పేస్టు అయిపోయింది, పాలు లేవు, అలాగే కూరగాయలు కూడా పట్టుకురా" అని ఒకటే గొడవ అమ్మది. పాలు లేకపోతే కాఫీ కూడా ఇవ్వదని గుర్తొచ్చి గబాలున లేచి 'బ్లింక్ఇట్' లో ఆర్డర్ పెట్టా. కాసేపటికి కాలింగ్ బెల్ మోగగానే ఆర్డర్ చేసిన వస్తువులే వచ్చి ఉంటాయని అనుకుంటూ మళ్ళీ దుప్పటి కప్పుకొన్న నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ.

"సుశీలా! ఇదిగో పాల ప్యాకెట్లు, పేస్టు, కూరగాయలు," అంటూ నాన్న లోపలికి వచ్చాడు.

"ఎవరు తెచ్చారండీ? మీరే వెళ్లారా?" అమ్మ వాటిని తీసుకుంటూ అడిగింది.

"ఇది మన తరం కాదు సుశీలా! సంచి పట్టుకొని పోయి సరుకులు, కూరగాయలు తేవడానికి. కనురెప్ప ఒకసారి మూసి, తెరిచే లోపే ఇంటి ముందు వచ్చి వాలుతాయి వస్తువులు. దాన్నే 'బ్లింక్ ఇట్' అంటారు," నాన్న నవ్వుతూ సమాధానమిచ్చాడు.

"ఓహో! అందుకేనా మీరు కళ్ళు తెరిచి మూసే లోపు అన్నారు," అనుకుంటూ అమ్మ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

పడుకున్నానే నిద్ర రావట్లేదు. లేవాలని కూడా అనిపించడం లేదు. అమ్మా, నాన్నల మాటలు వింటూ ఉండిపోయాను. నిజమే! ఈ తరమే వేరు. డబ్బులుంటే చాలు, అన్నీ కళ్ళముందు వాలుతాయి. ఒకప్పుడు మనిషి పరుగులెత్తుతున్న కాలంతో పోటీ పడేవాడు, కానీ ఇప్పుడు కాలమే మనిషి వెనుక పరుగులు పెడుతున్నట్టుంది. ఆ కాలంతో, ఈ కాలంతో పనిలేకుండా, అన్ని కాలాల్లో అన్నీ దొరుకుతున్నాయి.

పుచ్చకాయలు, మామిడి పళ్ళు ఎండాకాలంలో మాత్రమే దొరికేవి. కానీ ఇప్పుడు అలా కాదు. కాలు బయట పెట్టకుండానే షాపింగ్ చేయవచ్చు. ఇష్టమైన బట్టలు కొనుక్కోవచ్చు. కొన్న తర్వాత నచ్చకపోతే తిరిగి పంపించవచ్చు. మనిషి కష్ట పడకుండా సుఖంగా జీవించడానికి ఎన్నో అవకాశాలు. మనమైతే ఎంతో కష్టపడి పిల్లలను పెంచి పెద్ద చేశాం. దేవుడి దయ వల్ల, వాళ్ళు

దేవునికి ఇష్టంగా జీవిస్తే చాలు, అంతకంటే ఇంకేమీ వద్దు," అన్నాడు నాన్న.

"అవునండీ, మీరు చెప్పింది నిజమే. దేవుడి చేతుల్లో మన పిల్లలను పెట్టడమే శ్రేయస్కరం. ఆయనే అన్నీ చూసుకుంటాడు. వాళ్లకు దేవునితో వ్యక్తిగత సంబంధం ఉంటే అంతకన్నా కావాల్సిందేమి ఉంది," అంది అమ్మ నన్ను, చెల్లిని ఉద్దేశించి.

******

అవును! ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే పరుగు తప్పదు. చదువులో రాణించాలన్నా,మంచి ఉద్యోగం సంపాదించాలన్నా, ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా పోటీ పడక తప్పదు. ఈ పరుగును ఆపితే, మనలను వెనక్కి నెట్టేసి తొక్కేస్తారు. వాళ్ళ కింద నలిగిపోవడం తప్ప మనం చేయగలిగేది ఏమీ ఉండదు.

ఒకప్పుడు "పరుగులెత్తి పాలు తాగడం కన్నా నిదానంగా నీళ్ళు తాగడమే మిన్న" అనేది అమ్మా నాన్నల తరం నాటి సామెత. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు పరుగులెత్తి పాలు తాగాలనుకోవడమే ట్రెండ్. కామన్‌గా ఉంటే థ్రిల్ ఏముంటుంది అనుకుంటూ అలానే నిద్రపోయా... నేను లక్షలు పెట్టి కొన్న నాకిష్టమైన బైక్‌పై వేగంగా వెళ్తుంటే ట్రాఫిక్ పోలీసు ఆపాడు. లైసెన్స్ కోసం జేబులు వెతుక్కుంటూ ఉంటే, రోజూ ఈ పాటికి ఆఫీసులో ఉండేవాడివి ఇప్పుడేమిటీ తొమ్మిది గంటల లైనా నిద్రలేవ లేదు అంటూ అమ్మ నిద్ర లేపింది. ట్రాఫిక్ పోలీసులు ఆపకపోతే ఎప్పుడో ఆఫీసులో ఉండేవాడిని అన్నాను నేను. ఏంటి కలలో కూడా బైక్ నడిపావా అని అంది అమ్మ. అయ్యో! ఇదంతా కలా? నిజంగా జరిగినట్లే ఉంది అని తలగోక్కున్న. లేచి రెడీ అవ్వు, ఉప్మా తిందువు గాని, చల్లారితే బాగోదు అంది. ఏంటి? సెలవు రోజున కూడా ఉప్మానా? అంటూ గావు కేక వేశాను. ఏంట్రా నాన్న ఆ అరుపు, ఈ పూటకి దేవుడిచ్చాడు, థ్యాంక్స్ చెప్పి తినాలి గానీ కేకలేస్తే ఎలా? అన్నాడు నాన్న. ప్రతి విషయానికి మధ్యలో దేవుని తెస్తావు నాన్న. ఉప్మా రవ్వ అయిపోవాలని అమ్మ చేసింది అన్నాను కాస్త కోపంగా. అయితే ఒక పని చేయరా! ఆ గావు కేకలు ఆపి బ్లింక్ఇట్‌లో ఆర్డర్ చేసుకో నీకిష్టమైన టిఫిన్‌ని అంది అమ్మ తనకు ఇది వరకే తెలిసిన బ్లింక్ఇట్ అవగాహనతో.

సుశీలా! బ్రేక్‌ఫాస్ట్‌కు జొమాటో, స్విగ్గీ అనే వేరే యాప్‌లు ఉన్నాయి. మన పిల్లల కోసం మనం కూడా ఈ విషయాలన్నీ నేర్చుకోవాలి. పాత చింతకాయ పచ్చడిలా ఉండకూడదు అన్నాడు నవ్వుతూ. మంచి బ్రేక్‌ఫాస్ట్ తెచ్చుకోమని మోటివేట్ చేసిన అమ్మకు మనసులోనే థ్యాంక్స్ చెపుతూ ఆర్డర్ చేశా.

******


తినడం, త్రాగడం అన్ని ముగించుకొని బైబిల్ చదువుదామని కూర్చున్న. కాసేపు నన్ను నేను ఎవల్యూట్ చేసుకొన్న. మంచి జాబ్, హోదా, కాస్ట్లీ బైక్, న్యూ ట్రెండ్స్... దేనికోసం నా పరుగు? వీటన్నిటినీ బట్టి నాకు ఒక గుర్తింపు ఉండాలని కోరుకున్న. అసలు దేవుడు నన్ను ఎందుకు రక్షించాడు? నేను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే ఆయన నన్ను రక్షించాడే! ఈ బిజీ లైఫ్ పరుగులో నేను ఎక్కడికి వెళ్తున్నాను? గత నెలలో జరిగిన కంబైన్డ్ గ్యాదరింగ్‌లో నేను షేర్ చేసుకున్న వాక్యం నన్నే ప్రశ్నిస్తున్నట్టు అనిపించింది.

"క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపుకు కలుగు బహుమానము పొందవలెనని, గురి యొద్దకే పరుగెడుతున్నాను" (ఫిలిప్పీ 3:14).

ఈ తాత్పర్యమే కలిగి ఉండాలని ప్రతి విశ్వాసికి దేవుని వాక్యం బోధిస్తుంది. అన్నీ తెలిసి కూడా దారి తప్పడం నాకు అలవాటుగా మారింది. దేవా! నీ ట్రాక్ తప్పి ట్రాప్‌లో పడకుండా సాయం చెయ్యవా అని ప్రార్థించి, బైబిల్ చదవడానికి సిద్ధమయ్యా.

**– చేగూడి శ్యామలా కృపారావ్,**
**టీచర్ మరియు గ్రాడ్యుయేట్, ఎ.జి జోన్**

# ఫిబ్రవరి ‘25 – హగ్గయి గ్రంథము (1- 2 అధ్యాయాలు)




**అడ్డం**

4. దేవుని మందిరం కట్టేటప్పుడు, ఎవరి హృదయాల ను దేవుడు కదిలిస్తాడు?
6. ఏ సంవత్సరంలో దేవుని మందిరం కట్టడం ప్రారంభించారు?
8. దేవుని మందిరం పాడై ఉన్న సమయంలో, ప్రజలు ఏ విధమైన ఇళ్ళలో నివసిస్తున్నారు?
9. జెరుబ్బాబెలు, యెహోషువ మరియు ప్రజలు దేవుని మాటలకు ఎలా స్పందించారు?
10. హగ్గయికి దేవుని వాక్యం మళ్ళీ ఏ నెలలో తెలియజేయబడింది?
11. దేవుడు ఏ వస్తువులను “నావి” అని అంటున్నాడు?

**నిలువు**

1. దేవుని మందిరానికి పునాది ఏ నెలలో వేయబడింది?
2. దేవుడు ఎప్పుడు తన ప్రజలను ఆశీర్వదిం చాలని అనుకున్నాడు?
3. దేవుడు తన మందిరాన్ని ఏ వస్తువుతో కట్టమని చెప్పాడు?
4. దేవుని దృష్టిలో తన ప్రజలు ఎలా ఉన్నారు?
5. ప్రవక్తమైన హగ్గయి ప్రజలను ఏ విషయం గురించి ఆలోచించమని చెప్పాడు?
7. దేవుని మందిరం నిర్మాణ సమయంలో, దేవుడు వారికి ఏ నిశ్చయతను ఇచ్చాడు?
8. జనులు దేవుని మందిరం విషయంలో ఏమి చెప్పుకుంటున్నారు?

– బి.విజయ్, స్టాఫ్ కో-ఆర్డినేటర్, వనపర్తి

* * * * * *

## జనవరి ‘25 – ఫిలెమోను గ్రంథము (1 అధ్యాయం)

**అడ్డం:** 5.కన్నాడు 6.సువార్త 7.బలవంతము 8.కుమారుడు 9.ప్రియుడు

**నిలువు:** 1.పరిశుద్ధుల 2.బంధకము 3.వేడుకున్నాడు 4.దాసుడు 7.బస

**విజేత:** జ్యోతి గంగారాం, కొంపల్లి

# థీమ్ సాంగ్స్ ఆల్బమ్

ఆడియో విజువల్ డిపార్ట్‌మెంట్, వివిధ కాన్ఫరెన్స్‌లలో పాడిన థీమ్ సాంగ్స్‌ను సేకరించి, ఎంతో కృషితో, వ్యయాన్ని ఖర్చు చేసి, ఒక ఆల్బమ్‌ను రూపొందించి మీ ముందుకు తీసుకువచ్చింది. ఈ ఆల్బమ్ ద్వారా, ప్రతి ఒక్కరూ పాటలను విని, మన ప్రభువును స్తుతించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం. ఇంకా ఎవరైనా ఈ ఆల్బమ్ సిడిని తీసుకోకపోతే తప్పక కొనుగోలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాం. ఈ ఆల్బమ్ తయారీకి సహకరించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మరియు డిపార్ట్‌మెంట్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.




– జి.గంగారావు, సెక్రటరీ,
ఆడియో విజువల్ డిపార్ట్‌మెంట్.
సెల్ – 9989951895

# ఇప్పుడేమైందని



ఏలియా వలె అగ్నివంటి వాక్యంతో,
చీకటిని దహించి, భయమెరుగని ధీరుడవై,
బయలు వారినే భయపెట్టావ్,
ఇప్పుడేమైంది అన్నా?
పరిస్థితులకు భయపడి పారిపోయి దాక్కున్నావ్

మోషే వలె, నీ మాటతో సముద్రాన్ని పాయలు చేసావ్,
ఆరిన నేలపై నీ చెల్లెళ్ళను, తమ్ముళ్ళను నడిపావ్,
ఇప్పుడేమైంది అక్కా?
అరణ్యములో మిగిలిపోయావ్

దావీదు వలె, నీదైన నైపుణ్యంతో,
పరిచర్యలో, జీవంగల దేవుని పక్షానా అసాధ్యాలు చేసావ్,
ఇప్పుడేమైంది తమ్మీ?
ఒంటరివై, శోధనలలో చిక్కుకుని,
సొంత ప్రణాళిక వేస్తున్నావ్

యెహెూషువ వలె, విధేయతతో,
తరువాతి తరం నాయకురాలి వయ్యావ్,,
క్రమశిక్షణతో, కళాశాలలను దేవునికై గెలిచావ్,
ఇప్పుడేమైంది చెల్లీ?
ఓటమి రాగానే, అన్నీ మరచి,
మునుపటి స్థితివైపు జారుతున్నావ్?

గిద్యోను వలె, కొద్దిమందితో,
దేవుని ఆత్మ ద్వారా, వ్యూహాత్మక ప్రాంతాలను గెలిచావ్,
ఇప్పుడేమైంది మిత్రమా?
నీ విశ్వాసం కన్నా,
ప్రాపంచిక ధోరణి బరువెక్కిందా?

సొలోమోను వలె, దేవుడు నీకిచ్చిన జ్ఞానంతో,
ముందు తరాల వారికి సలహాలు ఇచ్చావ్,
ఇప్పుడేమైంది సేవకా?
అన్యస్తం నీ జ్ఞానాన్ని కనుమరుగు చేసిందా?

పేతురు వలె,
యేసును మాత్రమే చూస్తూ,
యేసుని పోలి నడక ప్రారంభించిన నిన్ను నన్ను,
ఏ భయమో,
సంశయమో ముంచేస్తూ ఉంది నడిసముద్రంలో,
వెనుతిరిగే ఉందామా?
మునుపు చేయిపట్టి లేపిన యేసుకు, మరలా
చేయందిద్దామా?

– డా॥ మనోజ్ కాంత్
వనస్థలిపురం


UESI PUBLICATIONS
Since 1988

**UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH**

Edited Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)